ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
3
శనివారం 13 జూలై 2024



పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం.. రూ.కోట్లు కూడబెడుతోంది. కార్డుదారులకు చేరాల్సిన బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోంది. నాణ్యత సరిగా ఉండదని కొందరు.. తినలేక మరికొందరు.. రేషన్ బియ్యాన్ని తీసుకో కుండా కార్డుదారులు ఎండీయూ ఆపరేటర్లు ఇచ్చే నగదు తీసుకుంటున్నారు. ఇదే అవకాశంగా ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు, దళారులు ఇలా రేషన్ మాఫియా బియ్యాన్ని బొక్కేస్తోంది. రేషన్ బియ్యం రీసైక్లింగ్‌తో మళ్లీ మిల్లర్లు ప్రభుత్వానికి అంటగడుతుండగా మరికొందరు బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. మరికొందరైతే విదేశాలకు కూడా తరలిస్తూ పెద్దమొత్తంలో సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. వీఆర్వో స్థాయి నుంచి జేసీ వరకు పర్యవేక్షణ లేకపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో రేషన్ మాఫియా రోజురోజుకు రెచ్చిపోతోంది. పెట్టుబడి లేకుండా రూ.కోట్లు వస్తుంది. దీంతో అధికారులను, రాజకీయ నాయకులను రేషన్ మాఫియా డబ్బుతో కొట్టి తమ జోలికి రాకుండా చేసుకుంటోందన్న విమర్శలున్నాయి. మంత్రి నాదెండ్ల మనోహర్ రేషన్ బియ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో అక్రమాలు కోకొల్లలుగా వెలుగు చూస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కూడా పెద్దఎత్తున బియ్యం దందా సాగుతోందనేది బహిరంగ రహస్యం. కూటమి ప్రభుత్వంలో ఈ దందాకు చెక్ పడుతుందా లేదా అని పలువురు ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి రేషన్ బియ్యం దందా ఓ ఛాలెంజ్‌గా మారింది.

రేషన్ బియ్యంతో.. రూ.కోట్లు



కిలో రూ.9కి కొని.. రూ.30కి విక్రయం

- రీసైక్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికే సరఫరా
- మంత్రి నాదెండ్ల తనిఖీల్లో అక్రమాలు బహిర్గతం
- ప్రభుత్వం రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేసేనా ?

బాపట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బియ్యం కిలో రూ.9. మార్కెట్‌లో ఈ రేటుకు బియ్యం ఎక్కడ లభిస్తుందని ఆశ్చర్యం వేస్తోందా. మార్కెట్‌లో కాదు ఇది తెల్ల కార్డుదారుడు బియ్యం విక్రయించే ధర. ఒక్కొక్క దళారీ చేతులు మారి తిరిగి ప్రభుత్వం వద్దకే రేషన్ బియ్యం చేరుతోంది. పెద్దఎత్తున రేషన్ బియ్యం రీ సైక్లింగ్ జరుగుతోంది. బ్లాక్ మార్కెట్‌కు భారీగా బియ్యం నిల్వలు తరలిపోతున్నాయి. బియ్యం బ్లాక్ మార్కెట్ పార్టీలతో సంబంధం లేకుండా జరుగుతుంది. రాష్ట్ర సరిహద్దులను దాటించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. కార్డుదారులకు సరఫరా చేస్తున్న బియ్యంతో సగానికి పైగా నిల్వలు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయనేది బహిరంగ రహస్యం. రీ సైక్లింగ్ రూపంలో ప్రభుత్వానికే రూ.30కి బియ్యం కొందరు మిల్లర్లు సర ఫరా చేస్తున్నారు. రేషన్ సరఫరా చేస్తున్న వాహన దారులు కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తు న్నారు. వేలి ముద్ర తీసుకుని కిలోకి రూ.9 నుంచి రూ.10 వరకు కార్డుదారులకు ఇస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని కిలో రూ.13 నుంచి రూ.14కు దళారీ లకు విక్రయిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని మిల్లుల్లో నిల్వ చేసి ఒక పట్టు పాలిష్ వేసి బ్లాక్ మార్కెట్‌లో కిలో రూ.23 నుంచి రూ.24కు విక్రయిస్తారు. పెద్దఎత్తున కాకినాడ పోర్టుకు, కొంత మేర తెలంగాణలోని హాలియా ప్రాంతానికి ఎగుమతి చేస్తున్నారు. పోర్టు నుంచి ఇతర దేశాలకు బియ్యం తరలి పోతున్న విషయాన్ని స్వయంగా మంత్రి నాదెండ్ల మనోహర్ తన తనిఖీల ద్వారా నిగ్గు తేల్చిన విషయం తెలిసిందే. హాలియా ప్రాంతానికి తరలిపోతున్న బియ్యానికి పాలిష్ పట్టించి తెలంగాణ ప్రాంతంలో మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు.

మంత్రి జిల్లా అయినా తగ్గేదేలేదు

వైసీపీ ప్రభుత్వం పడిపోయి కూటమి అధికారంలోకి వచ్చినా గుంటూరు జిల్లాలో రేషన్ మాఫియాకి ఏమాత్రం అడ్డుకట్ట పడటం లేదు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ జిల్లా నుంచే ప్రాతినిథ్యం వహిస్తున్నారన్న భయం కూడా మాఫియాలో ఇసుమంతైనా కనిపించడం లేదు. అధికారంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా తమకు అడ్డే లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నది. గత 12 రోజులుగా జిల్లాలో ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) ఆపరేటర్ల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ జరుగుతోన్నది. అయితే గతంలో వలే కేజీకి రూ.15 చొప్పున లెక్కించి కార్డుదారులకు నగదు ఇచ్చి ఆ బియ్యాన్ని దారి మళ్లించి సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక కాకినాడ వద్ద బియ్యం తరలిపోకుండా కఠినమైన చర్యలను మంత్రి నాదెండ్ల మనోహర్ చేపట్టడంతో ఇప్పుడు రూటుమార్చి కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కలెక్టర్‌గా బూర్ల రామాంజనేయులు(ప్రస్తుత ప్రత్తిపాడు ఎమ్మెల్యే) ఉన్న సమయంలో పదేపదే బియ్యాన్ని నల్లబజారుకు తరలించిన వారిపై ఉక్కుపాదం మోపారు. అప్పట్లో పీడీ యాక్టు కేసులు నమోదు చేసి జిల్లా నుంచి బహిష్కరించారు. ఇప్పుడు కూడా అలాంటి కఠినమైన చర్యలు చేపట్టకపోతే రేషన్ మాఫియాకి ముకుతాడు పడటం కష్టమన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.

దుకాణాలను చెరపట్టి..

వైసీపీ హయాంలో గుంటూరు పరిధిలో టీడీపీకి చెందిన కొంతమంది డీలర్లపై వేటు వేశారు. తొలుత పార్టీ మారమని ఒత్తిడి చేశారు. వారిలో కొందరు మారకపోవడంతో పౌరసరఫరాల అధికారుల ద్వారా దాడులు చేయించి స్టాకులో వ్యత్యాసం ఉందని చెప్పి వారిని సస్పెన్షన్ చేశారు. ఇలా నగరంలో 15 మంది డీలర్లను సస్పెన్షన్ చేసి ప్రత్యామ్నాయంగా పొదుపు సంఘాల మహిళలకు నిర్వహణ బాధ్యతలు కేటాయించారు. అయితే ఇది కేవలం కాగితాల్లో మాత్రమే. క్షేత్రస్థాయిలో ఆయా షాపులన్నీ మాఫియా చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఆయా సంఘాలకు నెలకు రూ.5 వేలు చెల్లిస్తూ షాపులను చెరబట్టిన మాఫియా ఎండీయూలను వారి దారిలోకి తెచ్చుకుంది. కార్డుదారుల నుంచి బియ్యం సేకరించి తెచ్చినందుకు ఎండీయూకు కేజీకి రూ.3 ఇస్తున్నారు. డీలర్లు మరో రూ.5 కమీషన్ చేర్చి కేజీ రూ.23కు మిల్లర్లకు అమ్ముతున్నారు.

రబ్బర్ వేలిముద్రలతో..?

రేషన్ మాఫియా తన కబంధ హస్తాల్లోకి తీసుకున్న దుకాణాల్లో ఎండీయూలకు బియ్యం సరఫరా చేసేందుకు నిత్యం ఈ-పోస్‌లో వేలి ముద్ర వేయాలి. డ్వాక్రా మహిళల పేరుతో ఉన్న షాపులకు సంబంధించి రబ్బర్ వేలి ముద్రలను మాఫియా తయారు చేయించిందన్న ఆరోపణలున్నాయి. నిత్యం షాపుల వద్దకు వారొచ్చి వేలిముద్రలు వేయాల్సిన అవసరం ఉండదు. గుంటూరులో రేషన్ మాఫియా కు నేతృత్వం వహిస్తున్న వ్యక్తికి చెందిన కుటుంబ సభ్యులకు కూడా షాపులున్నాయి. అవసరమైతే నెలకు రూ.15 లక్షలు ఇచ్చి అయినా తమ జోలికి ఎవరూ రాకుండా చేసుకొంటామన్న ధీమాని వ్యక్తపరుస్తున్నారు. పోలీసు, విజిలెన్స్, పౌరసరఫరాల శాఖలు తూతూ మంత్రంగా నమోదు చేస్తున్న కేసుల వల్ల రేషన్ మాఫి యాకి ఎలాంటి భయం అనేది లేకుండా పోయింది.

నియోజకవర్గాల వారీగా దళారీలు..

నియోజకవర్గాల వారీగా బియ్యం బ్లాక్ మార్కెట్ వ్యాపారాన్ని దళారీలు పంచుకున్నారనేది అందరికీ తెలిసిన విషయమే. వీరు మిల్లులను లీజుకు తీసుకుని వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. రాత్రి వేళ డీలర్ల నుంచి బియ్యం నిల్వలను ఎంపిక చేసుకున్న మిల్లులకు తరలిస్తారు. గోతాలు మార్చి 25 కిలోలు, 50 కిలోల ప్యాకింగ్ చేస్తారు. ఈ ప్రక్రియ అంతా రాత్రి వేళల్లో నిర్వహిస్తారు.

ఒక్కో నియోజక వర్గంలో ఒక్కొక్క రేటు బ్లాక్ మార్కెట్‌కు నిర్ణయించినట్లు సమాచారం. ఒక నియోజకవర్గంలో బియ్యం బ్లాక్ మార్కెట్ చేసే వ్యక్తుల నుంచి నెలకు రూ.28 లక్షలు చెల్లించే విధంగా ఓ నేతతో ఒప్పందం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరో నియోజక వర్గంలో రూ.20 లక్షలు చెల్లించేలా దళారీలు మరో నేతతో బేరం కుదు ర్చుకున్నట్లు సమాచారం. సంబంధిత శాఖల్లో కొందరు అధికారులకు నెలవారీ మామూ ళ్లు అందుతున్నట్లు తెలి సింది. గత ప్రభుత్వం అధికారంలో ఉండగా బియ్యం బ్లాక్ మా ర్కెట్ చేసిన వ్యక్తులే ఇప్పుడు కూడా కొనసాగిస్తున్నారని తెలిసింది.

నెలవారీ మామూళ్లు ఫిక్స్

వైసీపీ హయాంలో పాలకుల అండతో జిల్లాలో రేషన్ మాఫియా రెచ్చిపోయింది. గతంలో అక్కడికక్కడ స్వల్పంగా రేషన్ బియ్యం పక్కదారి పట్టేవి. అలాంటిది గడచిన ఐదేళ్లలో ఆ దందాను వ్యవస్థీకృతం చేశారు. నెలవారీ మామూళ్లు ఫిక్స్ చేసి మరీ దందాను కొనసాగించారు. ఈ దందాలో ఏకంగా వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలే సూత్రధారులుగా ఉండడంతో అధికారులు సైతం చేష్టలుడిగి చూస్తుండిపోయారు. బాపట్ల జిల్లా పరిధిలో పర్చూరు, చీరాలలో ఈ దందా అయితే వైసీపీ ప్రభుత్వంలో ఆకాశమే హద్దుగాసాగింది. రెండేళ్లలో మొత్తం 123 6ఏ కేసులు నమోదైతే చీరాల, బాపట్ల పరిధిలోనే 90 వరకు కేసులు నమోదు కావడం గమనార్హం. గతంలో ముగ్గురి మీద పీడీయాక్టు ప్రతిపాదనలను సిద్ధం చేసినా అప్పటి వైసీపీ ప్రభుత్వ ఒత్తిళ్లతో అది కాగితాలకే పరిమితమైంది. పర్చూరు నియోజకవర్గం కారంచేడు మండలం స్వర్ణలో వైసీపీ ప్రజాప్రతినిధి రైస్‌మిల్లులోనే రేషన్ దందా ఇటీవల వరకు యథేచ్ఛగా నడిచేది. ఆ మిల్లుపై జరిగిన దాడుల్లో విడతల వారీగా 700, 150, 400 బస్తాలను అధికారులు స్వాధీనం చేసుకున్నా దందాకు వైసీపీ హ యాంలో అడ్డుకట్టపడలేదు. చీరాలలో సైతం వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఈ దందా నడిచింది.



నరసరావుపేటలో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం నిల్వలు (పాత చిత్రం)

బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట పడేనా ?

వైసీపీ హయాంలో బియ్యం బ్లాక్ మార్కెట్ చేయడంలో అక్రమార్కులు రెచ్చిపోయారు. అప్పట్లో కొన్ని చోట్ల టీడీపీ నేతలు బియ్యం అక్రమ నిల్వలను పట్టించిన విషయం తెలిసిందే. కూటమి అధికారంలోకి రావడంతో బియ్యం బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట వేస్తారా లేదా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన వారే. ఆయనకు గతంలో బియ్యం బ్లాక్ మార్కెట్‌పై పోరాటాలు చేసిన అనుభవం ఉంది. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం వేలాది క్వింటాళ్ల బియ్యం నిల్వలను కాకినాడ పోర్టులో సీజ్ చేయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెలలో బియ్యం నిల్వలు బ్లాక్ మార్కెట్‌కు తరలి పోకుండా మంత్రి చర్యలు తీసుకుంటారన్న వాదన వినిపిస్తోంది. కార్డు దారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యం నిల్వలు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల వద్దే ఉన్నాయి. డీలర్ల వారీగా వారి వద్ద బియ్యం నిల్వలను తనిఖీ చేస్తే కొంత మేర బియ్యం బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుందని చెప్పవచ్చు. ఈ ప్రక్రియపై దృష్టి సారిస్తారో లేదో చూడాలి.

ప్రతి నెలా 1,18,325 టన్నులు బ్లాక్ మార్కెట్‌కు..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి ప్రతి నెల 1,18,325 టన్నుల బియ్యం బ్లాక్ మా ర్కెట్‌కు తరలిపోతున్నట్లు సమాచారం. పల్నాడు జిల్లాలో 6,45,110 కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా 89,239 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తున్నా రు. బాపట్ల జిల్లాలో 4,84,029 కార్డులకు 63,446 టన్నులు, గుంటూరు జిల్లాలో 5,99,511 కార్డులకు 83,965 టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. బియ్యం సరఫరాపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. వీఆర్వో స్థాయి నుంచి జాయింట్ కలెక్టర్ వరకు బియ్యం సరఫరాను పర్యవేక్షించాల్సి ఉంది. రేషన్ షాపులను విధిగా తనిఖీ చేయాలని నిబంధనను కొందరు అధికారులు పాటించడంలేదు. దీంతో బియ్యం అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.

నిజాంపట్నం మండల పరిధిలో ప్రభుత్వ భూముల్లో రొయ్యల సాగు



ఆక్రమణలపై ఆరా

- ప్రభుత్వ భూముల్లో రొయ్యల సాగు
- 4,000 ఎకరాలను చెరబట్టిన వైసీపీ నేతలు
- సమీక్షలో తెరపైకి ఏడబ్ల్యూడీ భూముల వ్యవహారం
- నివేదిక కోరిన రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్
- జాబితాపై మత్స్యశాఖ కసరత్తు.. రేపోమాపో అందజేత

బాపట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు చెరపట్టారు.. అనుమతులు లేకుండా రొయ్యల సాగు చేపట్టారు.. నోటీసులు జారీ చేసినా అధికార పార్టీ అండతో పట్టించుకునే వారే లేరు.. ఈ క్రమంలో కూటమి అధికారంలోకి రావడం బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో ఏడబ్ల్యూడీ భూముల వ్యవహారం తెరపైకి వచ్చింది. ఎన్‌జీటీ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ విచ్చలవిడిగా రొయ్యలసాగు జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 9,000 ఎకరాల ప్రభుత్వ భూముల్లో రొయ్యలసాగు అవుతుండగా ఇందులో 4,000 ఎకరాల వరకు గడచిన ఐదేళ్లలో వైసీపీ నేతాగణం అనుచరులు చెరబట్టినవే. ఒక్కొక్కరు 25 నుంచి 30 ఎకరాల వరకు రొయ్యల సాగు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. అనుమతులు లేకుండా సాగు చేస్తున్న రొయ్యల చెరువులకు నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం లేని వాటిపై చర్యలు తీసుకోవాలని గతేడాది ఎన్‌జీటీ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. నోటీసులకు స్పందించకపోతే రొయ్యల చెరువులను ధ్వంసం చేయాలని కూడా ఆదేశించింది. కానీ ప్రభుత్వ భూముల్లో రొయ్యల సాగు చేస్తున్న వా రిలో ఎక్కువ శాతం మంది వైసీపీ నేతల అనుచరులే కావడంతో అధికారులు నోటీసుల జారీతో సరిపెట్టారు తప్పితే ఎన్‌జీటీ ఆదేశాలను అమలు చేయలేదు. ఎకరం, రెండెకరాల ప్రభుత్వ భూమిలో రొయ్యల సాగు చేసుకుంటున్న పేద రైతులు దాదాపు 5,000 మంది వరకు ఉన్నారు. కొంతమంది వైసీపీ నాయకులు అప్పటి వరకు సాగు చేసుకుంటున్న రైతులను అడ్డుకుని ఆ భూముల్లో సాగు చేపట్టారు. నిన్నమొన్నటి వరకు జిల్లా వ్యవసాయ సలహా మండలిలో సభ్యుడిగా ఉన్న బాపట్లకు చెందిన ఓ వైసీపీ నేత వందల ఎకరాల ప్రభుత్వ భూములను చెరబట్టి రొయ్యల సాగు చేపట్టారని సమాచారం. విచిత్రమేమిటంటే ఇదే వ్యక్తి పర్యావరణ కాలుష్యం గురించి సమావేశాల్లో ఉపన్యాసాలు ఇవ్వడం విశేషం.

తాత్కాలిక లైసెన్సులు ఇచ్చే అవకాశం...

ముందుగా ఆ భూముల్లో సాగా వేసిన వారి వివరాలు బయటకు వచ్చిన తర్వాత అర్హులైన పేదలకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయనున్నది. అర్హులైన వారికి ప్రభుత్వ భూముల్లో రొయ్యల సాగు చేసుకునే అవకాశం కల్పిస్తూ ఎన్‌జీటీ నిబంధనలు అమలయ్యేలా చూడాలనే కృతనిశ్చయంతో కొత్త ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఇదే అభిప్రాయాన్ని రెవెన్యూమంత్రి అనగాని సైతం జిల్లా సమీక్షలో వెలిబుచ్చారు. ఉత్పత్తులు మంచిరేటుకు అమ్ముకోవాలంటే రొయ్యల సాగు చేసే పొలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ లైసెన్సులు ఇవ్వాల్సి ఉంది. ఇతర దేశాలకు ఎగుమతి చేసేటప్పుడు సైతం ఈ లైసెన్సు అనేది కీలకం. దీంతో మొత్తం వివరాలు వచ్చాక అర్హులైన వారికి తాత్కాలిక లైసెన్సులను కాలపరిమితితో ఇచ్చే అవకాశాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇదే సమయంలో ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములను భోజ్యం చేసిన వైసీపీ నేతలపై కొరఢావిధించాలనే డిమాండ్లు ఉన్నాయి.

సోమవారం నాటికి నివేదిక

బుధవారం కలెక్టరేట్ వేదికగా జరిగిన సమీక్షలో ప్రధానంగా ఈ అన్‌రిజిష్టర్డ్ రొయ్యల సాగు అంశంపై చర్చ నడిచింది. దీంతో పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని మంత్రి అనగాని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన కసరత్తును మత్స్యశాఖ చేస్తోంది. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి రొయ్యలసాగు చేసింది ఎవరు అనే కోణంతో పాటు, ఉన్న సాగుదారులను బలవంతంగా బయటకు పంపించి చెరబట్టింది ఎంత అనే కోణంలో కూడా వివరాలు రాబడుతున్నారు. మరోవైపు ఎన్‌జీటీ ఆదేశానుసారం నోటీసులు అందుకున్న వారిలో స్పందించిన వారెంతమంది, వాటిని ఖాతరు చేయకుండా వ్యవహరించినవారు ఎంతమంది అనే అంశాలపై కూడా అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తం నివేదికను మండలాల వారీగా సేకరిస్తున్నారు.

అభివృద్ధికి.. అనువైన సమయం

- భవనాసి చెరువులో అడుగంటిన నీరు
- పూడిక తీసి.. పర్యాటకంగా తీర్చిదిద్దాలని వినతులు



భవనాసి చెరువులో పూర్తిగా అడుగంటిన నీరు

అద్దంకి, జూలై 12: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కంభం చెరువు తరువాత పెద్ద చెరువులలో భవనాసి చెరువు ఒకటి. 106 సంవత్సరాల నాటి చెరువు కావడంతో పూడిక బాగా పేరుకు పోయింది. సుమారు 10 అడుగుల మేర పూడిక ఉన్నట్లు అంచనా. చెరువులో పూర్తిస్థాయిలో నీరు అడుగంటడం చాలా అరుదు. గత ఏడాది సాగర్ ఆయకట్టుకు సాగు నీరు విడుదల కాకపోవడంతో నీటి నిల్వ తక్కువగా ఉండి ప్రస్తుతం అతి తక్కువ నీరు మాత్రమే చెరువులో ఉంది. గతంలో కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో మినహా ఎప్పుడూ ఇలా నీరు తక్కువగా ఉన్న పరిస్థితులు లేవు. శింగరకొండలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాన్ని ఆనుకుని ఉన్న భవనాసి చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. సుమారు దశాబ్దకాలంగా భవనాసి చెరువును కేంద్ర ప్రభుత్వ నిధులతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. భవనాసి చెరు వు మధ్యలో ఐలాండ్‌ను ఏర్పాటు చేసి బుద్ధుడు.. లేదా అంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పార్క్‌గా అభివృద్ధి చేయడంతో పాటు బోటింగ్ సౌకర్యం కల్పిస్తే పర్యాటకంగా విశేష ఆదరణ పొందుతుంది. అయితే ఆ ప్రతిపాదనలు ఇంతవరకు కార్యరూపందాల్చలేదు. ప్రస్తుతం నీటి నిల్వ బాగా తక్కువగా ఉన్నందున పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఇది మంచి సమయం అని పలువురు అభిప్రాయ పడుతున్నారు. భవనాసి చెరువు రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసే పనులు కూడా 15 సంవత్సరాలుగా సాగుతున్నాయి. ప్రస్తుతం గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా ఉండడంతో అసంపూర్తిగా ఉన్న భవనాసి రిజర్వాయర్ పనులు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించి భవనాసి చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని అద్దంకి ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మా అల్లుడని డబ్బులిచ్చి ఆదుకున్నాం

లావణ్య తల్లితండ్రులు



ప్రస్తుతం టాలీవుడ్‌లో నటుడు రాజ్‌తరుణ్, లావణ్య వ్యవహారం ఓ హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటివరకూ లావణ్య మాత్రమే మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు ఆమె తల్లితండ్రులు కూడా మీడియా ముందుకు వచ్చి ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. చెప్పుకోలేని సంఘటనలు జరిగాయని కన్నీళ్లు పెట్టుకున్నారు. కరోనా సమయంలో రాజ్‌తరుణ్‌కి ఎవరూ సాయం చేయకపోయినా అతన్ని అల్లుడిగా భావించి డబ్బు సాయం చేసి ఆదుకున్నట్లు వారు చెప్పారు. 'మా అమ్మాయికి రాజ్‌తరుణ్ అన్యాయం చేశాడు. అతను ఎక్కడున్నా తీసుకువచ్చి వాళ్లిద్దరినీ కలిపేవరకూ వెనుకంజ వేయం' అని లావణ్య తండ్రి స్పష్టం చేశారు. లావణ్యకు డ్రగ్స్ తీసుకునే అలవాటు లేదనీ, అక్రమ సంబంధాలు ఉన్నాయనడం కట్టుకథ అనీ, ఓ ఆడపిల్ల మీద ఇలా నిందలు వేయడం తగదనీ ఆయన అన్నారు. తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయనీ, 'డ్రగ్స్ కేసులో నువ్వు బెయిల్ మీద బయటకు వచ్చావనీ, ఇలాంటి న్యూసెన్స్ చేస్తే బెయిల్ రద్దయి, ఇక జైలు నుంచి తిరిగి రాలేవని రాజ్‌తరుణ్, హీరోయిన్ మాల్వి బెదిరించారని లావణ్య చెప్పారు. రూ. ఐదు కోట్లు ఇచ్చి సెటిల్‌మెంట్ చేసుకుంటామని, కేసు వెనక్కి తీసుకోమని కూడా చెబుతున్నారని ఆమె వెల్లడించారు. 'నేను డ్రగ్స్ తీసుకుని ఉంటే రాజ్‌తరుణ్ కూడా తీసుకున్నట్లే. నేను వాటిని అమ్మితే .. అమ్మించింది అతనే. ఇందులో నిజం ఏమిటో పోలీసులే తేల్చాలి' అన్నారు లావణ్య. 'ఈ పోరాటం ఆపను. రాజ్ ఎక్కడ ఉంటే అక్కడికి వెళతాను. 14 ఏళ్ల పరిచయం, పదేళ్ల సహజీవనం ఎలా కాదంటాడో నేనూ చూస్తా' అని స్పష్టం చేశారు లావణ్య

విజిలేస్కో...



తమిళ హీరో విజయ్ కథానాయకుడిగా వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). శుక్రవారం చిత్ర బృందం తొలి పాటను విడుదల చేసింది. 'విజిలేస్కో' అంటూ సాగే ఈ మాస్ గీతానికి రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. యువన్ శంకర్ రాజా స్వరాలు సమకూర్చడంతో పాటు నకాష్ అజీజ్‌తో కలసి ఆలపించారు. ప్రశాంత్, ప్రభుదేవా, స్నేహ, లైలా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బేనర్ నిర్మిస్తోంది. సినిమాటోగ్రఫీ: సిద్దార్థ నుని.

ఆర్.సి 16లో శివన్న



రామ్‌చరణ్, జాన్వీ కపూర్ జంటగా రూపొందుతున్న ఆర్.సి. 16 చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ శుక్రవారం వచ్చింది. చిత్ర పరిశ్రమలో అందరూ ఆప్యాయంగా 'శివన్న' అని పిలుచుకునే శివ రాజ్‌కుమార్ ఇందులో నటిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా సినిమాలో ఆయన లుక్‌ను విడుదల చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఆహ్వానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. 'ఉప్పెన' చిత్ర దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. సంగీత సంచలనం ఏ.ఆర్.రెహమాన్ ఈ సినిమాకు స్వరాలు అందిస్తున్నారు.

అప్పుడు సోలో.. ఇప్పుడు యుగళం



లవ్, రొమాంటిక్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్.. ఈ జానర్లలో రూపుదిద్దుకునే చిత్రాలను ప్రేక్షకులకు దగ్గర చేసేవి వాటిల్లో పాటలే. సంగీతం ఇంత ముఖ్య పాత్ర పోషిస్తుంది కనుక పాటల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంటారు. ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా నటిస్తున్న 'డార్లింగ్' చిత్రం నుంచి ఇప్పటి వరకూ రెండు పాటలు విడుదలయ్యాయి. ఇవి ప్రియదర్శి, నభా నటేశ్‌ల సోలో సాంగ్స్. ఇప్పుడు వీరిద్దరూ కలిపి పాడుకున్న లవ్ సాంగ్ 'సున్ చెలియా' ను శుక్రవారం విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి పాడారు. వివేక్ సాగర్ సంగీత దర్శకుడు. ఈ నెల 19న విడుదల కానున్న ఈ చిత్రాన్ని అశ్విన్ రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మించారు.

ప్రేమకథలు జీవితకాలం వెంటాడుతాయి



సంతోష్ శోభన్, సోషల్ మీడియాలో పాపులర్ అయిన అలేఖ్య హారిక జంటగా ఓ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఎస్.కె.ఎన్., దర్శకుడు సాయిరాజేశ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. సుమన్ పాతూరి దర్శకుడు. హీరో సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. ఇందులో ఉన్న 'ప్రేమకథలు జీవితకాలం వెంటాడుతాయి' అనే క్యాప్షన్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమయ్యే ఈ చిత్రం మ్యూజిక్ సిట్టింగ్స్ సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ సారథ్యంలో ప్రస్తుతం జరుగుతున్నాయి.

అక్షయ్‌కుమార్‌కు కరోనా



చిత్ర ప్రముఖుల్ని కరోనా రక్కసి ఇంకా వదిలి పెట్టలేదు. తాజాగా బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ ఈ రక్కసి చేతికి చిక్కారు. ప్రపంచ కుబేరుడు ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ వివాహానికి వెళ్లడం కోసం శుక్రవారం కొవిడ్ టెస్ట్ చేయించుకున్నారు. పాజిటివ్ రావడంతో పెళ్లికి వెళ్లడం మానుకుని ఇంటి గదికి పరిమితం అయ్యారు. తమిళంలో హిట్ అయిన సురారై పోట్రు' చిత్రం ఆధారంగా రూపొందిన 'సర్ఫిరా' చిత్రం శుక్రవారం విడుదల అయింది. ఈ సినిమా ప్రమోషన్స్ కోసం ఇటీవల చాలా చోట్లకు వెళ్లారు అక్షయ్. అప్పుడే ఆయనకు వైరస్ సోకి ఉంటుందని అంటున్నారు.

నా ఫ్లాపుల్ని ఎంజాయ్ చేస్తున్నారు

'సర్ఫిరా' ప్రమోషన్స్‌లో భాగంగా అక్షయ్ ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'నా ఫ్లాపుల్ని చూసి కొంతమంది ఎంజాయ్ చేస్తున్నారు. పరిశ్రమలో ఇలాంటి రాజకీయాలు బాధ కలిగిస్తున్నాయి' అని ఆవేదనతో చెప్పారు. ఏడాదికి నాలుగు సినిమాలు చేస్తూ, ఓవర్ ఎక్స్‌పోజ్ అవుతున్నాడంటూ వచ్చిన కామెంట్స్ ను ఆయన కొట్టి పడేశారు. 'నేను రెండేళ్లకు ఒక్క సినిమానే చేస్తా. అది హిట్ అవుతుందని ఎవరైనా గ్యారంటీ ఇవ్వగలరా?' అని అక్షయ్ ప్రశ్నించారు. 'వర్క్ చేస్తూనే ఉండాలి. నీ దగ్గరకు వచ్చిన అవకాశాల్ని పోగొట్టుకోకు. ఎవరి మాటా వినకు. నీ నటన ప్రేక్షకులకు నచ్చితే వాళ్లే నిన్ను నెత్తిన పెట్టుకుంటారు' అని అమితాబ్ చెప్పిన మాట పాటిస్తున్నా' అని చెప్పారు అక్షయ్.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/bmGd9pLలో చదవండి.

చిన్న సినిమా... వసూళ్లలో మిన్న

ఈ మధ్యకాలంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన చాలా చిత్రాలు బాక్సాఫీసు దగ్గర వసూళ్ల సునామీ సృష్టించడం చూసిందే. రూ. 300 కోట్లు, రూ. 500 కోట్ల వసూళ్లు అనే మాట చాలా సామాన్యంగా వినిపిస్తోంది. కానీ అవన్నీ భారీ బడ్జెట్‌తో తెరకెక్కడం వల్లే వసూళ్లు కూడా ఖర్చుకు తగిన స్థాయిలో వచ్చాయి. కానీ పరిమిత బడ్జెట్‌తో, అది కూడా ఎలాంటి స్టార్స్ లేకుండా వచ్చిన కొన్ని బాలీవుడ్ సినిమాలు రూ. వంద కోట్ల వసూళ్లను సాధిస్తున్నాయి. అగ్రహీరోలు, దిగ్గజ దర్శకులు లేకున్నా ఆకట్టుకునే కథలతో ప్రేక్షకులను అలరిస్తూ, కాసుల వర్షం కురిపిస్తున్నాయి.

ఓ సినిమా కమర్షియల్‌గా హిట్టా, ఫట్టా అనేది చెప్పడానికి రూ. 100 కోట్ల వసూళ్లు అనేది ఇప్పుడు ఓ కొలబద్దగా మారింది. అయితే అగ్రతారలకు సైతం అన్నిసార్లు ఈ ఫీట్ సాధ్యం కావడం లేదు. భారీ హైప్‌తో వచ్చిన పాపులర్ హీరోల చిత్రాలు సైతం బాక్సాఫీసు దగ్గర రూ. వంద కోట్ల వసూళ్లను దాటలేక చతికిలపడుతున్నాయి. దీనికి భిన్నంగా ఎలాంటి స్టార్స్ లేకుండా, కంటెంట్‌ను మాత్రమే నమ్ముకొని వచ్చిన కొన్ని చిన్న సినిమాలు బాలీవుడ్‌లో అలవోకగా వందకోట్ల మార్క్‌ను అధిగమిస్తున్నాయి.



కోట్లు కొల్లగొట్టిన పిల్లదెయ్యం



బాలీవుడ్ తాజా సంచలనం 'ముంజ్యా' చిత్రం రూ. వంద కోట్ల క్లబ్‌లో చేరింది. హారర్ కామెడీ జానర్ సత్తా ఏంటో మరోసారి చూపింది. ఇందులో పేరున్న బాలీవుడ్ తారాగణం లేదు. శార్వరీ వాఘ్, అభయ్ వర్మ లాంటి చిన్న నటీనటులే. దర్శకుడు ఆదిత్య సర్పోదర్‌కు గతంలో భారీ హిట్లు ఇచ్చిన వ్యక్తి కాదు. అయినా 'ముంజ్యా' మాత్రం విడుదలైన రెండు వారాల్లోనే రూ. వంద కోట్ల క్లబ్‌లో చేరింది. రూ. 30 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 150 కోట్ల వసూళ్లను సాధించింది. ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రాల్లో ఐదో స్థానంలో నిలిచింది.

అగ్రతారలు లేకున్నా కాసుల వర్షం

సీనియర్ నటీమణులు కరీనాకపూర్, టబు... యువ కథానాయిక కృతీసనన్ ప్రధాన తారాగణంగా రూపొందిన హీరోయిన్ ఓరియంటెడ్ మూవీ 'క్రూ' సైతం అంచనాలు మించి వసూళ్లను అందుకొంది. ప్రచార చిత్రాలతోనే ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడడంతో దాదాపు 2500 స్క్రీన్లలో ఈ చిత్రాన్ని విడుదల చేశారు. ఈ కామెడీ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా రూ. 150 కోట్ల వసూళ్లను సాధించింది. స్టార్ హీరోల రేంజ్‌లో ఈ చిత్రం వసూళ్లను సాధించడం ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరిచింది.

కంటెంట్‌తోనే కలెక్షన్లు

కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో రూపొందిన హిందీ చిత్రం 'ఆర్టికల్ 370'. ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైంది. రూ. 20 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం రూ. 110 కోట్ల వసూళ్లను సాధించింది. కథానాయికగా ఇప్పటివరకూ పెద్ద విజయాలు దక్కని యామీ గౌతమ్ ఈ సినిమాలో లీడ్‌రోల్ పోషించగా, ప్రియమణి కీలకపాత్రలో నటించారు. వీరు తప్ప పేరున్న నటీనటులెవరూ ఈ చిత్రంలో లేరు. ఆర్టికల్ 370ని తొలగించే క్రమంలో ప్రభుత్వానికి ఎదురైన సవాళ్లు, లోయలో శాంతి భద్రతలను కాపాడేందుకు మిలిటరీ చేసిన ఆపరేషన్స్‌ను దర్శకుడు ఆదిత్య సుహాస్ ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను మెప్పించింది. ఫలితమే బాక్సాఫీసు దగ్గర మంచి మార్కులు కొట్టేసింది.

సక్సెస్ బాటలో చిన్న సినిమా



కరోనా ప్రభావానికి బలైన చిత్రపరిశ్రమల్లో బాలీవుడ్‌ది అగ్రస్థానం. అప్పటివరకూ వరుస హిట్లతో కళకళలాడిన పరిశ్రమ కాస్తా ప్రేక్షకులు థియేటర్లకు రాక వెలవెలబోయింది. వరుస అపజయాలతో అగ్రహీరోలు, నిర్మాతలకు ఏం పాలుపోని పరిస్థితి. ఇంకా ఇప్పటికీ బాలీవుడ్ మునుపటి జోరు చూపించలేకపోతోంది. అగ్రహీరోలతో రూ. వందల కోట్లు ఖర్చుపెట్టి సినిమాలు తీసిన కొన్ని పెద్ద నిర్మాణ సంస్థలు దివాళా అంచుకుచేరాయి. ఈ పరిస్థితి ఇలా కొనసాగుతుండగా కొత్త తరహా కంటెంట్‌తో వచ్చిన కొన్ని చిన్న చిత్రాలు బాక్సాఫీసును దునేస్తున్నాయి.



అయితే కొంతమంది విమర్శకులు ప్రాపగాండా చిత్రాలుగా పేర్కొన్న 'ది కేరళ స్టోరీ', 'ది కశ్మీర్ ఫైల్స్' చిత్రాలు ఆశ్చర్యపరిచే వసూళ్లను సాధించాయి. మత మార్పిడికి గురైన అమాయక యువతి చివరకు సరిహద్దులు దాటి ఉగ్రవాద సంస్థ ఐసిస్ చెరలో బంధీగా మారిన వైనాన్ని ఇందులో చూపించారు. అదాశర్మ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో పేరున్న బాలీవుడ్ నటీనటులు లేరు. కథ కూడా పూర్తిగా కేరళ నేపథ్యంలో సాగుతుంది. దక్షిణాదిన ఈ సినిమాకు కమర్షియల్‌గా లాభించకపోయినా ఈ సినిమా హిందీ వెర్షన్‌ను ప్రేక్షక లోకం అమితంగా ఆదరించింది. అందుకే రూ. 20 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం ఏకంగా రూ. 250 కోట్ల వసూళ్లతో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 2022లో వచ్చిన 'కశ్మీర్ ఫైల్స్' చిత్రం సైతం రికార్డులను తిరగరాసిందనే చెప్పాలి. ఒక డాక్యుమెంటరీలా సాగే కథనంతో తెరకెక్కిన ఈ సినిమా ఊహించని వసూళ్లను సాధించింది. తొలి రోజు 600 స్క్రీన్లలో విడుదల చేస్తే, వారం తిరగకుండానే నాలుగు వేల స్క్రీన్లకు పెంచాల్సి వచ్చింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో రూ. 20 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రం కాస్తా రూ. 300 కోట్ల వసూళ్ల మార్క్‌ను అధిగమించింది. బాలీవుడ్‌లో విక్కీ కౌశల్‌కు ఒక్కసారిగా స్టార్‌డమ్ సంపాదించిపెట్టిన చిత్రం 'యురి' కేవలం రూ. 25 కోట్ల వ్యయంతో తెరకెక్కింది. ఈ చిత్రం హిందీ బెల్ట్‌లోనే రూ. 250 కోట్ల వసూళ్లను రాబట్టింది. ప్రపంచవ్యాప్తంగా రూ. 350 కోట్ల వసూళ్లను రాబట్టింది. పలువురు అగ్రహీరోల చిత్రాలను పక్కకునెట్టి 2019లో అత్యధిక వసూళ్లు సాధించిన మూడో చిత్రంగా నిలిచింది.



సీపీఎం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో ప్రసంగిస్తున్న పాలిట్‌బ్యూరో సభ్యుడు బేబి

మతతత్వ బీజేపీని తిరస్కరించిన ప్రజలు

● సీపీఎం పాలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబి

తాడేపల్లి, జూలై 12: కేంద్రంలో బీజేపీ మతతత్వ రాజకీయాలను, రాజ్యాంగ మార్పు ప్రయత్నాలను ప్రజలు అడ్డుకున్నారని, అందువలనే 2024 ఎన్నికల్లో పట్టుకోల్పోయిందని సీపీఎం పాలిట్‌బ్యూరోసభ్యుడు ఎంఏ బేబి అన్నారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని సుందరయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శుక్రవారం ప్రారంభమైన సీపీఎం రాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ఎంఏ గఫూర్, కే లోకనాథం, డీ రమాదేవి, పి అప్పలనరస అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. బేబి మాట్లాడుతూ దేశంలో అనేక పార్టీలు బీజేపీ తీరును తీవ్రంగా వ్యతిరేకించాయని, అందుకే బీజేపీ పెద్దలు ఇద్దరు సీఎంలను జైలులో పెట్టించి నియంతృత్వంగా వ్యవహరించారని విమర్శించారు. బీజేపీ ఫాసిస్టు విధానాలను అర్థం చేసుకోలేని కొన్ని ప్రాంతీయ పార్టీల వలన దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి ఓట్లు పెరిగాయన్నారు. పార్లమెంటులో పూర్తిమెజారిటీ లేకపోయినా నియంతృత్వ విధానాలు కొనసాగిస్తుందని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కూటమి నేతలు ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలు, సూపర్-6 పథకాల అమలుకు షెడ్యూలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ మైనార్టీల సంక్షేమానికి ప్రకటించిన హామీల అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాజధాని అమరావతి నిర్మాణంలో జాగువద్దని సూచించారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ.. విశాఖ రైల్వే జోన్, విభజనహామీలు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, తదితర విషయాలలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని టీడీపీ జనసేనలు ప్రతిఘటించాలని అన్నారు. మతోన్మాద బీజేపీని ప్రతిఘటించాల్సిన బాధ్యత వామపక్షాలపై ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పీ మధు, కార్యవర్గసభ్యులు వీ వెంకటేశ్వర్లు, పాశం రామారావు, జొన్నా శివశంకర్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలనుకొండలో నేడు చంద్రబాబు పర్యటన

● ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ తుషార్ డూడి

తాడేపల్లి, జూలై 12: గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండలోని హరేకృష్ణ గోకుల్ క్షేత్రంలో శనివారం ఉదయం 8.30 గంటలకు జరగనున్న అనంత శేష స్థపన కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు పాల్గొంటున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ తుషార్ డూడి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్ శుక్రవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి పూజా కార్యక్రమ స్థలంతోపాటు సభాస్థలి ప్రాంతాన్ని పరిశీలించారు. భక్తులు వలంటీర్లు కూర్చునే గ్యాలరీని పరిశీలించి సూచనలు అందించారు. వాహనాల పార్కింగ్ బారికేడ్లు పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. బందోబస్తు ఏర్పాట్లతోపాటు క్రౌడ్ మేనేజ్‌మెంట్‌ను సజావుగా చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. కార్యక్రమానికి ఎలాంటి అవాంతరం లేకుండా నిరంతర విద్యుత్ శక్తి ఉండేలా తగు ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఫైర్ సేఫ్టీ వాహనాలు, మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌వో విజయలక్ష్మి, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరెడ్డి, తాడేపల్లి తహశీల్దార్ విజయకుమార్, హరేకృష్ణ గోకుల్ క్షేత్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

19న అరుణాచలంనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

గుంటూరు, జూలై 12: ఈనెల 21న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌టీఆర్ బస్టాండ్ నుంచి 19న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 20వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బసచేసి 21న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదేరోజు సాయంత్రం బయల్దేరి 22వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 బస్సు సర్వీస్ నెంబర్‌కు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోఛార్జీ రూ.2420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 73828 97459 సంప్రదించాలని కోరారు.

3 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

చేబ్రోలు, జూలై 12: నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 3 టన్నుల రేషన్ బియ్యాన్ని చేబ్రోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం గురువారం అర్ధరాత్రి గుంటూరు వైపు నుంచి చుండూరు వైపు వెళ్తున్న ఆటోను నారాకోడూరు గ్రామం వద్ద పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఆటోలో రేషన్ బియ్యాన్ని గుర్తించి చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సుబ్బారావు అనే వ్యక్తికి చెందిన ఆటోగా గుర్తించారు. ఆటో డ్రైవర్ రామారావుపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకోవటమే కాకుండా సుబ్బారావు కోసం పోలీసులు గాలిస్తున్నారు.

విజ్ఞాన్స్‌లో 'డార్లింగ్' సినిమా యూనిట్ సందడి


డార్లింగ్ యూనిట్ సభ్యులతో లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

గుంటూరు(విద్య), జూలై 12: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శుక్రవారం సినీ హీరో ప్రియదర్శి తన 'డార్లింగ్' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా సందడి చేశారు. కార్యక్రమంలో హీరో ప్రియదర్శి, హీరోయిన్ నభా నటేష్, దర్శకుడు అశ్విన్ రామ్, ఇతర సినిమా సిబ్బంది పాల్గొన్నారు. యూనిట్ బృందాన్ని విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్‌చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు అభినందించారు.

నెలరోజుల చంద్రబాబు పాలన అద్భుతం

పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 12: నెలరోజుల చంద్రబాబు నాయుడు పాలన అద్భుతంగా ఉందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నా రు. పరిపాలన మొదలుపెట్టిన వెంటనే అవ్వాతాతలకు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌ని రూ.4వేలకు పెంచి ఇచ్చారన్నారు. సచివాల య ఉద్యోగుల ద్వారా ఒకటో తేదీనే పెన్షన్లు పంపిణీ చేసి సుసా ధ్యం అని నిరూపించారన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని తెచ్చి భవననిర్మాణరంగంపై ఆధారపడిన అనేక రంగాల కార్మికుల కుటుంబాలలో సంతోషాన్ని నింపారన్నారు. ఒక దార్శనికుడు అధికారం చేపట్టడంతో గతంలో రాష్ట్రం వీడివెళ్లిపోయిన అనేకమం ది మరలా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి క్యూ కడుతున్నారన్నారు. విభజన హామీలలో భాగంగా ఇరు రాష్ట్రాల మధ్య సమస్య లపై సయోధ్య కుదుర్చుకునేందుకు తెలంగాణ ముఖ్యమంత్రితో సమావేశమై మరొక అడుగు ముందుకు వేశారన్నారు. భోగాపురం విమానాశ్రయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు ప్రణాళిక లు రూపొందించారని చెప్పారు. పట్టిసీమ నీటిని కృష్ణమ్మ చెంతకు తెచ్చి రైతాంగానికి నీటి కష్టాలను తీర్చారని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 16347 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. రాష్ట్రానికి అమరావతే రాజధాని అంటూ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో గాడితప్పిన పాలనను సక్రమమార్గంలో పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి

● డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వినతి


డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు వేచివున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

మంగళగిరి, జూలై 12: రాష్ట్రంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్స్ ద్వారా వైద్య సేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌కు శుక్రవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. 2023లో నేషనల్ హెల్త్ మిషన్‌లో 160 కేడర్లకు వేతనాలు పెంచి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు మొండిచెయ్యి చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా జీతంతోపాటు చెల్లించవలసిన ఇన్సెంటివ్స్ గత ఏడు నెలల నుంచి పెండింగ్‌లో వున్నాయని, రకరకాల ఇండికేటర్ల నెపంతో అయిదు వేల మందిని ఇన్సెంటివ్‌కు అనర్హులుగా పరిగణించి అన్యాయం చేస్తున్నారని తెలిపారు. విలేజ్ క్లినిక్స్ అద్దెలు, కరెంటు బిల్లులు 8 నెలలుగా బకాయి వున్నాయన్నారు. కేంద్రం మార్గదర్శకాల ప్రకారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులరైజ్ చేయాలని, తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పులి ప్రేమ్‌కుమార్, ప్రియాంక, ప్రమోద్, నరేష్, వర్మ, సాయి, మనోజ్, మధు సుధాకర్, అపర్ణ, సాయికుమార్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

గుండిపార్వతీ అమ్మవారి దేవస్థానంలో చోరీ

● రూ.6లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన దుండగులు

భట్టిప్రోలు, జూలై 12: మండల కేంద్రం భట్టిప్రోలు హిందూ శ్మశాన వాటికలో ఉన్న శ్రీ గుండిపార్వతీ అమ్మవారి దేవస్థానంలో చోరీ జరిగింది. గురువారం రాత్రి పూజా కార్యక్రమాల అనంతరం తాళం వేసి వెళ్ళిన అర్చకులు శుక్రవారం ఉదయం వచ్చి చూసే సరికి తాళాలు పగులకొట్టి ఉండడం, హుండీ లేకపోవడంతో దేవస్థాన కమిటీ సభ్యులకు తెలియజేశారు. సభ్యులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ పసుపులేటి రామకృష్ణ, ఎస్ఐ కాసుల శ్రీనివాసరావులు పరిశీలించి వివరాలను సేకరించారు. బాపట్ల నుంచి వచ్చిన క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. సుమారుగా రూ.6లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని, వీటితో పాటుగా పంచలోహ విగ్రహాలు, హుండీని పగులకొట్టి గోడ అవతల పారవేశారని కమిటీసభ్యులు ఫిర్యాదులు పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ ఇంటికి నోటీసులు

తుళ్లూరు, జూలై 12: నదీపాతంలో ఎటువంటి కట్టడాలు నిర్మించకూడదు. అటువంటిది నిబంధనలకు విరుద్ధంగా బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ నిర్మాణం చేపట్టడంతో సీఆర్డీఏ, ఉద్దండ్రాయునిపాలెం పంచాయతీ గురువారం నోటీసులు జారీ చేసింది. అంతేకాకుండా సీడ్ రోడ్డు పక్కన సీఆర్డీఏ భూములు ఆక్రమించి కార్యాలయం, ఫుట్‌బాల్ కోర్టు తదితర నిర్మాణాలు చేశారు. వాటికి కూడా నోటీసులు ఇచ్చారు. దీనిపై వారంరోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని సీఆర్డీఏ అధికారులు, పంచాయతీ సంయుక్తంగా నోటీసులు జారీ చేశాయి.

సీఎంఏ ఫౌండేషన్‌లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో అన్నా నందకిషోర్ తదితరులు

గుంటూరు(విద్య), జూలై 12: జాతీయస్థాయిలో ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసి సీఎంఏ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించారని చైర్మన్ అన్నా నందకిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థులు ఎస్కే ఫిర్దోస్ 316 ర్యాంకు, బి.నరసింహసాయి ధీరజ్ 312, బి.వెంకటశివకార్తీక్ 310, ఎస్.భవన్ వెంకటసాయి 304, కె.తిరుమల సాయిసంతోష్ 304, వి.శరణ్యలక్ష్మి, బి.రాహుల్ 302, ఎన్.భవ్యసాయి, ఎస్.కిషోర్, ఎస్కే సలామ్ 300 ర్యాంకులు సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

రేవుల వేలంపాట వాయిదా


రేవుల వేలంపాట కోసం జిల్లా పరిషత్‌కు వచ్చిన పాట దారులు

గుంటూరు సిటీ, జూలై 12: గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ ఆధీనంలోని రేవులకు, బల్లకట్టులకు నిర్వహించాల్సిన వేలంపాట మరోసారి వాయిదా పడింది. వేలంపాటలో పాల్గొనేందుకు శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి పలువురు జిల్లా పరిషత్‌కు చేరుకున్నారు. సీల్డ్ టెండర్లు దాఖలు చేస్తున్న సమయంలోనే అధికారులు పడవలు, బల్లకట్లకు సంబంధించిన ధ్రువపత్రాలు ఉండాలని స్పష్టం చేయటంతో కొద్ది సేపు సందిగ్ధం ఏర్పడింది. పాటదారులకు పడవలు, బల్లకట్లు నిర్వహణకు సంబంధించిన లైసెన్స్ ఫిట్నెస్, ఇన్సూరెన్స్ సరంగు లైసెన్స్ కచ్చితంగా ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. అవేవీ పాట దారుల వద్ద లేవని తేలటంతో వేలంపాట వాయిదా వేస్తున్నట్లు జడ్పీ డిప్యూటీ సీఈఓ జె.మోహన్‌రావు తెలిపారు. వేలంపాట తేదీని మళ్ళీ ప్రకటిస్తామని వెల్లడించారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


శ్రీహర్ష మృతదేహం

నాదెండ్ల, జూలై 12: మండలంలోని సాతులూరు గ్రామ పరిధిలో ఒక ఇంటిలో అద్దాలు బిగిస్తూ చెరుకూరి శ్రీహర్ష(23) శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అప్పాపురం గ్రామానికి చెందిన శ్రీహర్ష గ్లాసుఫిట్టింగ్ కార్మికుడిగా పని చేస్తుంటాడు. శ్రీహర్ష చిన్నతనంలోనే తండ్రి మరణించాడు. తల్లి లక్ష్మీతో పాటు తమ్ముడు మార్క్‌తో కలసి నివశిస్తున్నాడు. ఇంకా వివాహం కాలేదు. నూతన గృహాల్లో అద్దాలు బిగించే పనికి వెళ్తూ కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉంటున్నాడు. శుక్రవా రం సాతులూరు గ్రామంలోని నూతనంగా నిర్మించిన ఒక ఇంట్లో రెండో అంతస్తులో అద్దాలు బిగిస్తుండగా విద్యుతాఘాతానికి గురయ్యాడు. తోటి కార్మికులు అతన్ని చికిత్స కోసం నరసరావుపేట తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. తల్లి లక్ష్మీ ఫిర్యాదుమేరకు నాదెండ్ల ఎస్ఐ బల రామిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐఎన్‌టీయూసీ గుర్తింపు నిలుపుదల

● తెలుగునాడు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నేత భానుమూర్తి

● 'హంస' గుర్తింపుపై ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడి

గుంటూరు సిటీ, జూలై 12: ఐఎన్‌టీయూసీ గుర్తింపు నిలుపుదల చేస్తూ హెల్త్ డైరెక్టర్ పద్మావతి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారని తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మలినేని భానుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ గుర్తింపు వ్యవహారంలో తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని హెల్త్ డైరెక్టర్ ఈ ఆదేశాలు జారీచేశారని చెప్పారు. ఏ యూనియన్ గుర్తింపు వ్యవహారం అయినా రాష్ట్ర లేబర్ కమిషనర్ పరిధిలో వుంటుందని అన్నారు. ఐఎన్‌టీయూసీ గుర్తింపు వ్యవహారంలో తొలుత అధికారులు పొరబడ్డారని, తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆ విషయంపై అభ్యంతరం లేవనెత్తిన నేపథ్యంలో గుర్తింపు నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారని తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన మరో యూనియన్ 'హంస' గుర్తింపుపై కూడా త్వరలో ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. సరైన అర్హతలు లేకుండానే కొన్ని సంఘాలకు అడ్డగోలుగా గుర్తింపులు ఇచ్చారని పేర్కొన్నారు.

25,626 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 21,027 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 25,626 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 12,347 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16000	334	8500	16500
నెంబరు. 5	10500	13000	నెంబరు. 5	10500	12500
273	9000	10000	273	--	--
341	9000	14300	341	9000	15500
4884	12500	12500	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	11500	11500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	18500	తేజ	11500	18000
బ్యాడిగి	8000	16000	బ్యాడిగి	8500	14000
దేవనూరుడీలక్స్	9000	12500	దేవనూరుడీలక్స్	10000	10000
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	5000	10500


టిడ్కో గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ లావు తదితరులు

టిడ్కో గృహ లబ్ధిదారులందరికీ త్వరలో మంచిరోజులు

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 12: టిడ్కో ఇళ్ళ లబ్ధిదారులందరికీ త్వరలోనే మంచిరోజులు రాబోతున్నాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. వైసీపీ హయాంలో వారికి పూడ్చలేని నష్టం జరిగిందని, సాధ్యమైనంత త్వరగా ఆ కష్టాల నుంచి ఉపశమనం కలిగించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. శుక్రవారం చిలకలూరిపేటలో టిడ్కో ఇళ్ళ సముదాయాన్ని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలతో కలసి ప్రత్తిపాటి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకలూరిపేటలో నివాసం లేని నిరుపేదలకు 4500 టిడ్కో గృహాలను 2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం అందజేసిందన్నారు. నాటినుంచి గత పాలకుల దౌర్జన్యం, అరాచకాల వల్ల కనీసం ఒక్కరిని కూడా గృహప్రవేశం చేయనివ్వకపోవటం దుర్మార్గం అన్నారు. టిడ్కోఇళ్ళపై లోన్‌లు తీసుకున్న లబ్ధిదారులపై బ్యాంకర్లు కూడా ఒత్తిడి పెంచుతుంటే ఏంచేయాలో పాలుపోని స్థితిలో పడిపోయారన్నారు. ముందుగా జంగిల్ క్లియరెన్స్ చేయాలని, పోలీసు ఔట్‌పోస్టు పెట్టాలని, పాఠశాల ఏర్పాటుచేయాలన్నారు. ఇంతకాలం లబ్ధిదారులను బెదిరించి టిడ్కో ఇళ్ళ వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డ అందరిపై కఠినచర్యలు తీసుకుంటామని ప్రత్తిపాటి హెచ్చరించారు. సదుపాయలన్నీ కల్పించి లబ్ధిదారులందరినీ గృహప్రవేశాలు చేయించటానికి ఏర్పాట్లు చేయబోతున్నామని తెలిపారు. మరో 2వేల ఇళ్ళు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన చేశామని, ఫౌండేషన్ లెవల్‌కు కూడా వచ్చిందన్నారు. వాటిని కూడా పూర్తిచేసి లబ్ధి దారులకు అందిస్తామన్నారు. అనంతరం ఎంపీ కృష్ణదేవరాయలు మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయంలో నివశిస్తున్న ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలు తప్పక పరిష్కరిస్తామని, ఇక్కడ సచివాలయం, రేషన్ దుకాణం, పీహెచ్‌సీ ఏర్పాటుకు కృషిచేస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియంపై జీఎస్టీ ఉపసంహరించాలి

● ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు విజ్ఞాపన


ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు వినతిపత్రం అందజేస్తున్న బీమా ఉద్యోగులు

గుంటూరు(తూర్పు), జూలై 12: బీమా ప్రీమియంపై విధిస్తున్న 18శాతం జీఎస్టీ ఉపసంహరించాలని కోరుతూ శుక్రవారం, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు బీమా ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. అంతేగాక పాలసీదారులు చెల్లించే బీమా ప్రీమియంకు సెక్షన్ 80సి కింద ప్రత్యేక ఇన్‌కమ్‌ట్యాక్స్ రాయితీలు కల్పించాలని ఎంపీకి విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యబీమాపై సెక్షన్ 80డి కింద రద్దుచేసిన రాయితీలను నూతన ఐటీ విధానం కింద పునరుద్ధరించాలని కోరారు. ముఖ్యంగా ప్రభుత్వ రంగంలోని నాలుగు సాధారణ బీమా సంస్థలను విలీనం చేయడం దేశ ఆర్థిక ప్రయోజనాలకు ఉపయోగకరమని ఎంపీ దృష్టికి బీమా ఉద్యోగులు తీసుకువచ్చారు. బీమా రంగానికి సంబంధించిన ముఖ్యమైన సమస్యలను కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎల్ఐసీ ఉద్యోగుల యూనియన్ మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వీవీకే సురేష్, కేజీ రమేష్, ఆర్‌వీఎస్ శ్రీనివాస్, డీ సైదులు, ఐ వెంకట్రావు, ఎస్ ప్రసాద్, పీఆర్ రాజశేఖర్, ఎం రాజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

తెనాలి-విజయవాడ రోడ్డుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

● అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే మాట నిలబెట్టుకున్న లోకేశ్


రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న ఆర్అండ్‌బీ సిబ్బంది

దుగ్గిరాల, జూలై 12: ఎంతోకాలంగా గుంతలమయమై వాహనదారుల ప్రయాణం నరకంగా మారిన తెనాలి-విజయవాడ మెయిన్‌రోడ్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మెయిన్‌రోడ్‌కు మరమ్మతులు చేపడతామని, రాష్ట్ర విద్య, ఐటీ, మానవనరుల శాఖామంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన నెల రోజులకే పనులు చేపట్టారు. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే మెయిన్‌రోడ్‌లో గడచిన ఐదేళ్లలో జరిగిన రోడ్డుప్రమాదాల్లో అంగవైకల్యం పొందినవారు, ప్రాణాలు కోల్పోయినవారున్నారు. దుగ్గిరాల -రేవేంద్రపాడు మధ్య పెద్ద ఎత్తున గుంతలు పూడ్చివేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం పట్ల వాహనదారులు లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

మంత్రి అచ్చెన్నాయుడుకు ఎమ్మెల్యే నరేంద్రవర్మ శుభాకాంక్షలు

బాపట్ల, జూలై 12 : రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధకశాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్యశాఖల మంత్రిగా రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన కె.అచ్చెన్నాయుడును ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


అచ్చెన్నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

యాత్రికుల రక్షణకు పటిష్ఠ చర్యలు

● ఎస్పీ వకుల్ జిందాల్



బాపట్ల, జూలై 12 : సముద్రతీరప్రాంతాలలో యాత్రికుల రక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ విషయమై శుక్రవారం ఆయన మాట్లాడుతూ సముద్రంలో నిర్దిష్టలోతులో ఎరుపురంగు జెండాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. పర్యాటకులు నిర్దేశించిన ప్రదేశాలలోనే సముద్రస్నానాలు ఆచరించాలన్నారు. ఎరుపురంగు జెండాలు దాటి లోతుకు వెళ్లరాదన్నారు. మద్యంసేవించి సముద్రంలో దిగరాదన్నారు. పోలీసు శాఖ సూచనలు యాత్రికులు తప్పనిసరిగా పాటించాలన్నారు. సూచనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలోని సూర్యలంక, రామాపురం, ఓడరేవు సముద్రతీరానికి వచ్చే పర్యాటకుల కోసం భద్రతా చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. గతనెలలో చోటు చేసుకున్న వరుస ప్రమాదాలలో యాత్రికులు మృత్యువాత పడటంతో తగిన భద్రతా పరమైన చర్యలు తీసుకోవటానికి తాత్కాలికంగా కొన్నిరోజులు సముద్ర తీరంలోకి యాత్రికులను అనుమతించలేదన్నారు. జిల్లాలోని రిసార్ట్ నిర్వాహకులతో కమిటీ ఏర్పాటు చేసి వారి సహకారంతో యాత్రికులు సముద్రంలో మునిగే ప్రదేశాలలో గజఈతగాళ్ళను నియమించటం జరిగిందన్నారు. గజ ఈతగాళ్ళకు రక్షణగా లైఫ్‌జాకెట్‌లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రజలను అప్రమత్తం చేయటానికి పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌లను, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. సివిల్, మెరైన్ పోలీసులతో సముద్రతీరం వెంట గస్తీ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. యువకులు, విద్యార్థులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని, కావున సముద్రస్నానాలకు ఆచరించటానికి విచ్చేసే యువతపై ప్రత్యేక నిఘా ఉంచటం జరుగుతుందన్నారు.

ప్రత్యేక కౌంటర్‌ను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

బాపట్ల, జూలై 12 : పట్టణంలోని తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని శుక్రవారం జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు ఆకస్మిక తనిఖీ చేశారు. తక్కువ ధరలకు నిత్యవసర సరుకుల విక్రయాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యతను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రత్నగుప్తా, బాపట్ల అధ్యక్షుడు కోళ్ళపూడి శివరామప్రసాద్, నాయకులు నల్లమల్లి శ్రీనివాసరావు, తటవర్తి శిరీషా, మలిశెట్టి పుల్లయ్య, పవన్‌కుమార్, పీవీ రంగారావు, సుధాకర్, రామకృష్ణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.


తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు విక్రయాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు : తహసీల్దార్

బాపట్ల, జూలై 12 : ఇసుక విక్రయాలలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఇసుక స్టాక్ పాయింట్ వద్ద రికార్డులను శుక్రవారం ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుకను ప్రజలకు అందజేయాలని ఈ విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. ఆన్‌లైన్ ద్వారానే చెల్లింపులు జరగాలన్నారు. మెట్రిక్ టన్నుకు 551 రూపాయలు చొప్పున మాత్రమే చెల్లించే విధంగా చూడాలన్నారు. కేటాయించిన సమయంలో తప్పనిసరిగా విక్రయాలు జరపాలన్నారు.


బాపట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డులోని ఇసుకస్టాక్‌పాయింట్ దగ్గర రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

బాపట్ల, జూలై 12 : మండలంలోని ముత్తాయపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు పంపిణీ చేశారు. తాతా వెంకటేశ్వరరావు, తాతా నరేష్‌బాబు, తాతా కోటేశ్వరరావు, వీరంకి కిరణ్మయిల సహకారంతో వీటిని అందజేశారు. కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు విచారపు మునేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని దాతలను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ విధంగా పూర్వవిద్యార్థులు పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గురజాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సీహెచ్ రమాదేవి, జి.ఉమామహేశ్వరి, డి.వందనకుమారి పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న విచారపు మునేశ్వరరావు, దాత తాతా వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు

పేద మహిళలకు బియ్యం పంపిణీ

కర్లపాలెం, జూలై 12 : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎం.వి.రాజుపాలెంలోని నిరుపేద మహిళలకు శుక్రవారం సంస్థ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌బాషా సభ్యులతో కలిసి బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ హబీబ్, షేక్ జిలానీ, షేక్ బహదూర్ బాషా, షేక్ ఇబ్రహీం, షేక్ నాగూర, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.


నిరుపేద మహిళలకు బియ్యం అందజేస్తున్న ఫౌండేషన్ అధ్యక్షులు పఠాన్ అహ్మద్‌బాషా

రైతులకు సాగునీరందేనా?

● ప్రధాన కాల్వలో నీటికి అవరోధంగా మట్టికట్ట

● పేరుకుపోయిన తూటికాడ

అమృతలూరు, జూలై 12 : కృష్ణా పశ్చిమ డెల్టా తూర్పు ప్రధాన కాల్వలో సాగు నీటికి అవరధంగా మట్టి కట్టలు ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాగు సమయం ఆసన్నమైన నేపథ్యంలో నీటి పారుదల శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. తూర్పు ప్రధాన కాల్వలో వేసవి సీజన్‌లో మంచినీటి చెరువులు నింపేందుకు నీటిని విడుదల చేశారు. ఈ క్రమంలో గంగాయి కాల్వ ప్రారంభ సమీపంలో ప్రధాన కాల్వలో ఎగువ, దిగువ అడ్డకట్టలు వేశారు. ఇటీవల కాల్వలకు నీటి విడుదల జరిగింది. అయినా అధికారులు ప్రధాన కాల్వలో అడ్డంకులు తొలగించలేదు. ఈ కట్టల


కాల్వలో పేరుకుపోయిన తూటికాడ


తూర్పు ప్రధాన కాల్వలో అడ్డుగా ఉన్న కట్ట

వలన ప్రధాన కాల్వలో నీటి ప్రవాహం ఆగిపోయింది. అయినా నీటి పారుదలశాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. కాల్వకు నీటి విడుదల జరిగితే నీటి ప్రవాహం కొంత మేర ఈ అడ్డుకట్టల వద్ద ఆగిపోతుందని, తద్వారా ఎగువ ప్రధాన కాల్వ కట్టలు దెబ్బతినే అవకాశం ఉండటంతోపాటు, దిగువ భూములకు నీరు అందదని రైతులు చెబుతున్నారు. దీనికి తోడు కాల్వలో పేరుకుపోయిన తూటికాడ ఇంత వరకు తొలగింపు చేపట్టలేదని ఇలా అయితే సాగు నీరు ఎలా అందుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయ పనులు చేపట్టకముందు కాల్వల్లో తూటికాడ తొలగింపు చర్యలు వెంటనే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి : డీఎస్పీ

బాపట్ల, జూలై 12 : రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు సిబ్బంది తగుచర్యలు చేపట్టాలని డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ తెలిపారు. జీబీసీ రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల-కంకటపాలెం రోడ్డు వద్ద తరుచూ జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని శుక్రవారం డీఎస్పీ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. గురువారం రాత్రి జరిగిన ప్రమాదం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు జరగకుండా భారికేడ్‌లు ఏర్పాటు చేస్తామని అక్కడ ఉన్న ప్రజలకు డీఎస్పీ తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై సుధాకర్, విక్టర్‌లకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


పాలిటెక్నిక్ కళాశాల వద్ద రోడ్డును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

వైభవంగా సర్పసూక్త హోమార్చన, పుష్పయాగం

బాపట్ల, జూలై 12 : పట్టణంలోని చీలురోడ్డుసెంటర్‌లో ఉన్న పాండురంగస్వామి దేవాలయంలో స్కందషష్ఠి సందర్భంగా శుక్రవారం సుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకం, స్కందపూజ, పుష్పయాగం, సర్పసూక్తహోమార్చన కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా సుబ్రహ్మణ్య జపాలు, బ్రహ్మచారులకు పూజా కార్యక్రమాలు జరిగాయి. శ్రీలలిత త్రిపురసుందరీ పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు, పండితులు మేడూరి వెంకటఅప్పలాచార్యులు, పరాశరం రఘురాం, కొల్లిపర ప్రసాదస్వామి, పంగులూరి కౌండిన్య, భీమవరపు సురేష్, గూడూరి సాయి వెంకట్, ఆలయ ధర్మకర్త ఎం.బదిరి నారాయణ పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సర్పసూక్త హోమార్చన, పుష్పయాగం చేస్తున్న పండితులు

వైభవంగా శ్రీమహాలక్ష్మి అమ్మవారి కొలుపులు

బాపట్ల, జూలై 12 : పట్టణంలోని కాకుమానువారిపాలెంలో ఉన్న శ్రీమహాలక్ష్మీ అమ్మవారి కొలుపులు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. కొలుపులకు జీఎస్సార్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుండ్రెడ్డి శివ పాల్గొని లక్షరూపాయలు విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. కొబ్బరికాయకొట్టి కొలుపులు ప్రారంభించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని కనకతప్పెట్లతో, ప్రభ ఊరేగింపుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. సూర్యలంక రోడ్డులో పెద్ద ఎత్తున నిర్వహించిన ఈ వేడుకలో భాగంగా ఆలయ నిర్వాహకులు గుండ్రెడ్డి శివను ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, శివనాగేశ్వరరావు, రాఘవరావు, శివబ్రహ్మం, గోపి, సాంబు, మాజీ కౌన్సిలర్ చింతా కిషోర్, ఉషా, గోపి తదితరులు పాల్గొన్నారు.


జీఎస్సార్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుండ్రెడ్డి శివను సన్మానిస్తున్న కాకుమానువారిపాలెం అమ్మవారి ఆలయకమిటీ సభ్యులు, పెద్దలు

వర్షపునీరుతో పూలమార్కెట్‌లో వ్యాపారుల అవస్థలు

బాపట్ల రూరల్, జూలై 12 : బాపట్ల మండలం వెదుళ్ళపల్లి పూల మార్కెట్ ఆవరణలో వర్షపునీరు రోజుల తరబడి నిలబడి చెరువులను తలపిస్తున్నది. వెదుళ్ళపల్లి, బేతపూడి, వెదుళ్ళపల్లి కొత్తపాలెం తదితర గ్రామాల పూలసాగు రైతులు నిత్యం ఈ పూలమార్కెట్‌లో పూల వ్యాపారం జరుపుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. అయితే పూల మార్కెట్ ఆవరణలో వర్షపునీరు నిలబడి ఉండటంతో పూల వ్యాపారులు, రైతులు ఆ వర్షపు నీటి ద్వారా నానా ఇబ్బందులకు గురవుతున్నారు. పూల మార్కెట్ నుంచి పంచాయతీకి కొంత పన్నురూపేన వస్తున్నప్పటికి మార్కెట్‌లోని సమస్యను పంచాయతీ అధికారులు ఇంతవరకు పరిష్కరించకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు మార్కెట్ ఆవరణలో వర్షపు నీరు నిలబడకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.


వెదుళ్ళపల్లి పూలమార్కెట్ ఎదుట చెరువును తలపిస్తున్న వర్షపునీరు


సమావేశంలో మాట్లాడుతున్న నల్లమడ రైతు సంఘం సభ్యులు

నల్లమడ వాగు సమస్య పరిష్కారానికి కృషి చేయాలి

● నల్లమడ రైతు సంఘం సభ్యులు

బాపట్లరూరల్, జూలై 12 : నల్లమడ వాగు సమస్యలు పరిష్కారానికి ప్రతిరైతు ముందుకు రావాలని నల్లమడ రైతు సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామంలో చెరుకూరు, కాకుమాను, జమ్ములపాలెం, నరసాయపాలెం, కంకటపాలెం గ్రామాల రైతులతో శుక్రవారం రైతు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లా రాజమోహనరావు మాట్లాడుతూ నల్లమడ వాగు సమస్యకు శాశ్విత పరిష్కారం చూపేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టిలో ఉంచటం జరిగిందని తెలిపారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేలా అందరూ కృషి చేయాలని తెలిపారు. అనంతరం నల్లమడ రైతు సంఘం డిమాండ్‌లను గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గోవాడ సత్యనారాయణ, ప్రొఫెసర్ విజయ్‌కుమార్, కామేపల్లి కృషిబాబు, మాజీ ఎంపీపీ మానం విజేత, అంకమ్మచౌదరి రైతులు పాల్గొన్నారు.

అమ్మపేరిట మొక్కలు నాటుదాం

● సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎంవీ సుధాకర్

బాపట్ల, జూలై 12 : విద్యార్థులు అమ్మపేరుతో ఒక మొక్క నాటి దానిని పెంచి పెద్ద చేయాలని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎంవీ సుధాకర్ కోరారు. మండలంలోని కొండుభొట్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అమ్మపేరిట మొక్కనాటుదాం కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి ఉసిరి, గోరంటాకు మొక్కలు పాఠశాల ఆవరణలో నాటారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలో వారంలో 2,500 మొక్కలు నాటుతున్నామని ఆయన తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ప్రతి ఒక్కరు మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో డాక్టర్ బిళ్ళా మోజెస్. జీసీడీవో ఎం.చారులత, ప్రధానోపాధ్యాయులు కేవీ సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటుతున్న సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.వి.సుధాకర్, ఏఎమ్‌వో డాక్టర్ బిళ్ళా మోజెస్ తదితరులు.

ప్రభుత్వ పథకాలపై మత్స్యకారులకు అవగాహన

బాపట్ల, జూలై 12 : కేంద్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై మత్స్యకారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులతో మధురై, తమిళనాడులో జరిగిన సమ్మర్‌మీట్-2024 కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై జిల్లా మత్స్యశాఖాధికారి డాక్టర్ పి.సురేష్ ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మత్స్యసహాయ సంచాలకులు బి.కృష్ణ కిషోర్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు ఎం.రవీంద్ర, టి.రఘుకిషోర్‌రెడ్డి, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావుకు డాక్టరేట్

పిట్టలవానిపాలెం, జూలై 12 : పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిగా విధులు నిర్వహిస్తున్న మోర్ల శ్రీనివాసరావుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్టు ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వరత భవనంలో అంతర్జాతీయ మనం ఫౌండేషన్ వారు నిర్వహించిన 8వ వార్షికోత్సవంలో మనం ఫౌండేషన్ చైర్మన్, ఫౌండర్ డాక్టర్ కె.చక్రవర్తి ఆధ్వర్యంలో గురువారం కేంద్ర మాజీ మంత్రి సముద్రాలు వేణుగోపాల్, ప్రముఖ సినీనటుడు సుమన్ చేతుల మీదగా పద్మప్రతిభ అవార్డు, గౌరవ డాక్టరేట్ అందుకున్నట్లు, తనను ఘనంగా సన్మానించినట్లు మోర్ల శ్రీనివాసరావు తెలిపారు. అవార్డు అందుకున్న మోర్ల శ్రీనివాసరావును గ్రామపెద్దలు, గ్రంథాలయ పాఠకులు తదితరులు అభినందించారు.


మోర్ల శ్రీనివాసరావుకు అవార్డు అందజేస్తున్న కేంద్ర మాజీ మంత్రి సముద్రాలు వేణుగోపాల్, ప్రముఖ సినీనటుడు సుమన్

వెదసాగుపై మక్కువ చూపుతున్న రైతులు

రేపల్లె, జూలై 12 : తక్కువ ఖర్చుతో పంట పండించే దిశగా రైతులు తీరప్రాంతంలో వెదసాగుపై మక్కువ చూపుతూ ఖరీఫ్ సీజన్‌కు విత్తనాలు చల్లుకుంటున్నారు. రేపల్లె నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో 1.20 వేల ఎకరాల ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతుండటంతో రైతులు సాగునీటి కోసం ఎదురుచూడకుండా వెద పద్ధతిలో వరిసాగు చేసుకునేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే సుమారు 7వేల ఎకరాలకు పైనే వెదసాగుకు విత్తనాలు చల్లుతున్నారు. గత రెండు మూడు రోజులుగా చెదురుమదురుగా కురుస్తున్న వర్షాలకు వెదసాగుకు దోహదపడతాయని రైతులు చెబుతున్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వం

● నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య

రేపల్లె, జూలై 12 : రైతు సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం పని చేస్తుందని నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య అన్నారు. నిజాంపట్నంలో శుక్రవారం రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వంలో కక్షకట్టి పట్టిసీమ నీటిని విడుదల చేయకుండా కృష్ణా డెల్టా ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే కృష్ణా డెల్టాకు పట్టిసీమ నీటిని విడుదల చేశారని, చివరి ఆయకట్టు వరకు సమృద్ధిగా సాగునీరు అందిస్తామని ఆయన తెలిపారు. రైతుల అభ్యున్నతి కోసం నాణ్యమైన విత్తనాలను అందించటంతో పాటు రానున్న రోజుల్లో సబ్సిడీపై రైతుల సాగుకు సంబంధించి అధునాతన యంత్రాలను అందిస్తామన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధరను కల్పించి రైతు ఆర్థికంగా బలపడేందుకు టీడీపీ ప్రభుత్వం కూటమి పని చేస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు బొమ్మిడి రామకృష్ణ, వ్యవసాయశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.


రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందిస్తున్న నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

కొల్లూరు, జూలై 12 : 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శుక్రవారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. కొల్లూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్రవాసాంధ్రుడు తల్లపనేని కాశీనాథ్ పదో తరగతిలో 588/600 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. కొలుసు నర్మద 566 మార్కులు సాధించి రెండో స్థానం, తోటకూర అక్షిత 563 మార్కులు సాధించారు. బాలురోన్నత పాఠశాలలో కొక్కు చరణ్‌సాయి 559 మార్కులు, డొక్కు రామకృష్ణ 537 మార్కులు, కూనపరెడ్డి యోగేష్ 536 మార్కులు సాధించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు తల్లపనేని రాధాకృష్ణమూర్తి, అన్నపూర్ణమ్మల పేరిట ప్రశంసా పత్రాలను అందజేశారు. రాధాకృష్ణమూర్తి ఇదే పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించారు. గడిచిన విద్యా సంవత్సరంలో రెండు పాఠశాలల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయమని విశ్రాంత ఉపాధ్యాయులు సూర్యదేవర భరత్‌కుమార్, వెన్నం వెంకటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జ్యోతి, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు గుమ్మడి రామమోహనరావు, హెచ్‌ఎంలు సీహెచ్ ఉషాకుమారి, కె.నాగపాప, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు

సేవా కార్యక్రమాలతో పేదలకు అండగా నిలవాలి

భట్టిప్రోలు, జూలై 12 : ఉన్నత శిఖరాలు అధిరోహించిన పూర్వ విద్యార్థులు సేవా కార్యక్రమాలతో పేద విద్యార్థులకు అండగా నిలవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు ముద్దా లీలామోహనరావు అన్నారు. 1987-88 సంవత్సరం స్థానిక టీఎంరావ్ హైస్కూలులో పదవ తరగతి చదివిన విద్యార్థులు మైత్రి సేవా సమితిని ఏర్పాటు చేశారు. సేవా కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం సహ విద్యార్థి విజయవర్ధిని కుమార్తె ఇంటర్మీడియట్ చదువు నిమిత్తం పూర్వ గురువులు ముద్దా లీలామోహనరావు చేతుల మీదుగా రూ.35 వేల నగదును అందజేశారు. పర్యావరణ పరిక్షణలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయం, స్థానిక పోలీస్‌స్టేషన్, టీఎంరావ్ హైస్కూలు ప్రాంగణాల్లో మొక్కలను నాటారు. సేవా సమితి సభ్యులను అధికారులు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జునరావు, ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు, కార్యాలయ ఏవో జలజ, సేవా సమితి సభ్యులు ఉషారమణి, శ్రీనివాసరావు, దేవాజి, రమణ, విజయసారధి, సురేంద్ర, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


పేద విద్యార్థికి నగదు సాయం అందజేస్తున్న గురువు లీలామోహనరావు, పూర్వవిద్యార్థులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బాపట్ల, జూలై 12 : విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నిమిత్తం రెండో శనివారం ఉదయం 8 గంటలు నుంచి 11 గంటల వరకు బాపట్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పెరుగు శ్రీనివాసరావు తెలిపారు.

● బాపట్ల రూరల్, జూలై 12 : బాపట్ల మండలంలో శనివారం ఉదయం 9గంటలు నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని బాపట్లరూరల్ ఏఈ కోటేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్‌ల మరమ్మత్తులు, సబ్‌స్టేషన్‌ల మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ నిలిపివేయటం జరుగుతుందన్నారు.

● పిట్టలవానిపాలెం, జూలై 12 : పిట్టలవానిపాలెం, చందోలు, ఖాజీపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ మరమ్మతులు కారణంగా సరఫరా నిలిపివేయటం జరుగుతుందని మండల విద్యుత్‌శాఖాధికారి కె.చంద్రశేఖర్‌రావు తెలిపారు.

● రేపల్లె, జూలై 12 : విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్‌శాఖ ఏడీ శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ నుంచి రింగ్‌రోడ్డు వరకు, రింగురోడ్డు నుంచి జెండా చెట్టు, పోస్టాఫీసు, దర్గా రోడ్డు, యూనియన్ బ్యాంక్ రోడ్డు, నేతాజీనగర్ కాలనీ, పేటేరు రోడ్డు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం, షాదీఖానా ఏరియాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నదని తెలిపారు. అలాగే నిజాంపట్నం మండలం పరిధిలోని అన్ని గ్రామాల పరిధిలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు. 33/11కేవీ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

● భట్టిప్రోలు, జూలై 12 : భట్టిప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ ఏడుకొండలు తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆయా గ్రామాల పరిధిలో విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

గణపవరంలో గడ్డివామి దగ్ధం

కర్లపాలెం, జూలై 12 : మండలంలోని గణపవరం పంచాయతీ లంకమాలపల్లిలో శుక్రవారం తెల్లవారుజామున కంచర్ల విజయేంద్రరావుకు చెందిన 7 ఎకరాల గడ్డివామి మంటలలో కాలిబూడిదైంది. గడ్డివామి దగ్ధమౌతున్న విషయాన్ని బాపట్ల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించటంతో అగ్నిమాపక శకటం సంఘటన స్థలానికి వచ్చి సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు, ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

బీచ్‌లు పునఃప్రారంభం

వేటపాలెం(చీరాల), జూలై 12: తీరంలో గత నెలలో జరిగిన వరుస ప్రమాదాలతో బీచ్‌లను మూసివేశారు. పర్యాటకులకు అనుమతి నిషేధించారు. ఈక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య పోలీస్ అధికారులు, తీరంలోని రిసార్ట్స్, హోటల్స్ నిర్వాహకులతో ఒకటి రెండు,మూడు పర్యాయాలు సమీక్ష చేశారు. అంతిమంగా పర్యాటకుల భద్రతే అందరి లక్ష్యం కావాలని కొండయ్య చెప్పారు. ఈనేపథ్యంలో తీరంలో భద్రతా చర్యలకు రిసార్ట్స్, హోటల్స్ నిర్వాహకులు సంయుక్తంగా ముందుకువచ్చారు. తీరంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. తీరం నుంచి నిర్ణీత దూరం నుంచి లోతుకు వెళ్లకుండా ఎర్ర జెండాలు పాతారు. సెర్ఫ్ టవర్లు ఏర్పాటు చేశారు. నిర్ణీత స్నానాల ప్రదేశాల్లో గత ఈతగాళ్లను ఏర్పాటుచేశారు. వారికి లైఫ్ జాకెట్లతో పాటు హ్యాండ్ మైక్‌లు అందజేశారు. ప్రమాద హెచ్చరికలు ఎప్పటికప్పుడు తెలిపే విధంగా అన్నిచర్యలు చేపట్టారు. ఈక్రమంలో గురువారం రాత్రి పోలీస్ అధికారులు, రిసార్ట్స్ నిర్వాహకుల మధ్య జరిగిన చర్చల అనంతరం నిర్ణీత అంశాలను అమలుపరుస్తూ పర్యాటకులకు, రిసార్ట్స్, హోటల్స్ పునఃప్రాంభానికి అనుమతి ఇచ్చారు.

ఈసందర్భంగా ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ గతకొద్ది రోజులుగా సముద్రతీరంలో జరిగిన ప్రమాదాల కారణంగా అనుమతులు నిషేధించినట్టు చెప్పారు. ఆయా ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకుని శుక్రవారం నుంచి అనుమతులు కల్పించామన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థినులతో ఉపాధ్యాయులు

పంగులూరు, జూలై 12: మండలంలోని పంగులూరు, చందలూరు ఉన్నత పాఠశాలలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పదో తరగతి ఫలితాల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన పంగులూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని పూల నాగప్రణతికి నూజివీడు కళాశాలలో సీటు లభించింది. ఇదే పాఠశాలకు చెందిన మరో విద్యార్థి రాయని సాంబశివ మహేష్‌కు ఒంగోలు కళాశాలలో సీటు లభించింది. చందలూరు ఉన్నత పాఠశాలకు చెందిన గొట్టిపాటి చంద్రిక, భూమా శ్రీలిఖిత, చందలూరు హారిక, బద్దిగం రూపశ్రీ, కోమటి హేమశ్రీలు ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కేజీబీవీ విద్యార్థినికి నూజివీడులో సీటు

బల్లికురవ, జూలై 12: మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన విద్యార్థిని గోరంట్ల లక్ష్మీలావణ్య ట్రిపుల్ ఐటీ సీటును సాధించారు. మండలంలోని కొండాయపాలెంకు చెందిన లక్ష్మీలావణ్య గత ఏడాది కేజీబీవీలో పదో తరగతి సాధించారు. 585 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ విద్యార్థినికి నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటును ప్రభుత్వం కేటాయించింది. శుక్రవారం ఎంఈవోలు వస్త్రంనాయక్, రమేష్‌బాబు, కేజీబీవీ ప్రిన్సిపాల్ సరళకుమారి, ఉపాధ్యాయులు లక్ష్మీలావణ్యకు అభినందనలు తెలిపారు.

కోలలపూడి నుంచి ఇద్దరు విద్యార్థినులు..

మార్టూరు, జూలై 12: మండలంలోని కోలలపూడి హైస్కూల్‌కు చెందిన ఇద్దరు బాలికలకు ట్రిపుల్ ఐటీలో సీట్లు లభించినట్లు ప్రధానోపాధ్యాయుడు గోలి రామకోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జల్లి క్రీస్తువీణ నూజివీడులో సీటు పొందగా, మద్దుమాల మనీషా ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు పొందినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

అనధికార తూములు తొలగింపు

చినగంజాం, జూలై 12: సంతరావూరు సైడ్ చానల్‌లో అనధికారంగా వేసిన తూము లను నీటి పారుదల శాఖాధి కారులు శుక్రవారం తొలగిం చారు. డీఈఈ ఎస్.ప్రసాద రావు, ఏఈ ఎం.పవన్‌కుమా ర్‌లు రైతులతో కలిసి అనధి కారకంగా వేసిన తూముల ను పరిశీలించారు. అనధికా రంగా 12 తూములు వేసిన ట్లు గుర్తించారు. వీటిని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్నట్లు డీఈఈ తెలిపారు. అనధికార తూములను తొలగించి, సైడ్ ఛానల్‌కు మరమ్మతులు చేసి సక్రమంగా సాగునీటిని అందిస్తామని తెలిపారు. కొమ్మమూరు కాలువకు వచ్చిన పట్టిసీమ జలాలను సంతరావూరు లాకుల వద్ద నుంచి దిగువకు విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, విక్రం నారాయణ, నక్కల వెంకటనారాయణ, గొనసపూడి, కడవకుదురు రైతులు పాల్గొన్నారు.

ఈనాం భూములపై ఆర్డీవో వివరాల సేకరణ

మార్టూరు, జూలై 12:మండలంలో జంగమహేశ్వరపురం, లక్కవరం గ్రామాల పరిధిలోని ఈనాం భూముల వివరాలుపై శుక్రవారం ఆర్‌డీవో గంధం రవీందర్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ రెండు గ్రామాల పరిదిలోని ఈనాంభూముల పరిస్థితిపై చర్చించారు. పూర్వకాలం నుంచి రెండు గ్రామాలలో ఈనాంభూములు ఉన్నాయి. లక్కవరం గ్రామంలో 390 మంది రైతుల ఆధ్వర్యంలో 565 ఎకరాలు, జంగమహేశ్వరపురం గ్రామంలో 2830 ఎకరాలు ఉన్నాయి. వీటికి పాస్ పుస్తకాలు పొందడం కోసం ఈనాం భూములను క్రమబద్ధీకరించాలని ఏళ్ల తరబడి ప్రభుత్వం దృష్టికి రైతులు తీసుకెళుతున్నారు. ప్రస్తుతం ఈ భూములకు సంబంధించిన ఫైలు ఏకార్యాలయంలో, ఏస్థాయిలో ఉందనే విషయంపై ఆర్‌డీవో వివరాలు సేకరించారు. సమావేశంలో తహసీల్దార్ సంధ్యశ్రీ, డీటీ కోదండ రామ్, ఆర్ఐ రహమాన్ భాషా, వీఆర్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

వీర్లంకమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఏలూరి



వీర్లంకమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఏలూరి

చిన గంజాం, జూలై 12: పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామంలోని అవనిగడ్డ కుటుంబీకుల ఇలవేల్పు దేవర వీర్లంకమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శుక్రవారం రాత్రి దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలలో ఏలూరి సాంబశివరావు విజయం సాధిస్తే పెద గంజాం గ్రామంలోని పోలేరమ్మ అమ్మవారికి 101 కొబ్బరికాయలు కొడతామని పెద గంజాం టీడీపీ నాయకులు మొక్కుకున్నారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మొక్కుబడుల కార్యక్రమంలో ఏలూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఎన్నికలలో విజయం సాధించిన తరువాత తొలిసారి పెదగంజాం గ్రామ పంచాయతీలో పలు కార్యక్రమాలలో పాల్గొనటానికి వచ్చిన ఎమ్మెల్యే ఏలూరికి పెదగంజాం, పల్లెపాలెం గ్రామస్థులు భారీ గజమాలలతో స్వాగతం పలికారు. కార్య క్రమంలో పెదగంజాం సర్పంచ్ నక్కల కృష్ణ, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు పొద వీరయ్య, అబ్దుల్ కలాంఆజాద్, నాయకులు ఆసోది బ్రహ్మానందరెడ్డి, కోమట్ల శ్రీనివాసరెడ్డి గొల్లపోతు వెంకటేశ్వర్లు, దండుప్రోలు తిరుపతిరావు, వాటుపల్లి ఏడుకొండలు, కోకి భాస్కరరెడ్డి, వడ్లమూడి వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు ప్రగతికి తోడ్పాటునందించాలి

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వినతి
- సీఎం దృష్టికి తీసుకెళ్లిన పలుసమస్యలు



చంద్రబాబుతో ఎమ్మెల్యే ఏలూరి (ఫైల్)

పర్చూరు, జూలై 12: పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. శుక్రవారం సచివాలయంలోని సీఎం చాంబర్‌లో ఎమ్మెల్యే ఏలూరి కలిశారు. ఈసందర్భంగా పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

గుంటూరు ఛాలన్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు యద్ధప్రాతి పదికన నిధులు మంజూరుచేసి పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రిని కోరారు. గుంటూరు చానల్ పొడిగింపుతో తాగు, సాగునీటి సమస్య పరిష్కారం అవుతుదన్నారు. 2019లో మన ప్రభుత్వంలో రూ.275 కోట్ల నిధులు మంజూరుచేసినట్టు గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆపనులు రద్దు చేసిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా వైసీపీ నేతలు ఓట్లు తొలగించేందుకు కుట్రలు చేశారని దీనిపై విచారణ చేపట్టేందుకు సిట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఏలూరి కోరారు. కుట్రలకు పాల్పడిన వారిపై ఎలాంటి విచారణ జరపకుండా 52 మందిపై తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి నీరు కార్చారన్నారు.

చిలకలూరిపేట మండలం పసుమర్రు వద్ద మే నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే ఏలూరి కోరారు. ప్రమాదంలో మృతి చెందిన వారు పర్చూరు నియోజకవర్గంలోని చిన్నగంజాం మండలానికి చెందిన వారని తెలిపారు. నియోజకవర్గంలో 25 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందించాలని కోరారు. పర్చూరు నియోజకవర్గంతోపాటు, బాపట్ల జిల్లాను ప్రగతి పథంలో అగ్రభాగంలో నిలిపేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఏలూరి కోరారు. బస్సు ప్రమాద బాధితులను ఆదుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. అలాగే, గుంటూరు చానల్ పొడిగింపు కాలువల మరమ్మతులకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యోన్నతి ఫౌండేషన్ సేవలు అభినందనీయం



మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కును అందజేస్తున్న ఎంఈవో సుధాకరరావు, ఫౌండేషన్ డైరెక్టర్ వీరనారాయణ తదితరులు

అద్దంకిటౌన్, జూలై 12: మెరిట్ విద్యార్థుల చదువుకు ఎటువంటి ఆటంకం కలుగకుండా చేయూత నందిస్తున్న విద్యోన్నతి ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంఈవో -1 బూదాటి సుధాకరరావు అన్నారు. శక్రవారం స్థానిక కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యోన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమం హెచ్‌ఎం గురవయ్య అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఫౌండేషన్ డైరెక్టర్ ధూళిపాళ్ల వీరనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది 30 మందికి రూ.10 వేల చొప్పున ఇస్తున్నట్టు చెప్పారు. విద్యోన్నతి ఫౌండేషన్‌కు తన వంతుగా డాక్టర్ చదలవాడ ఫణీంద్రబాబు రూ.20 వేలు ప్రకటించారు. అలాగే, పెంట్యాల గంగాధర్ రూ.20 వేలు సిండికేట్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ తాళ్ళూరి బాబురావు రూ.10 వేలు ఇస్తున్నట్టు ప్రకటించారు. కాకానిపాలెం ఉన్నత పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు ఈ ఏడాది నుంచి రూ.10 వేల చొప్పున ఇద్దరికి అందిస్తానని సింగు సుబ్బాయమ్మ తెలిపారు. అనంతరం దూళిపాళ్ల వెంకటేశ్వర్లు, బోడెంపూడి శ్రీరామమూర్తిల జ్ఞాపకార్థం వారి మనుమరాలు డాక్టర్ షర్మిల ప్రియాంక సౌజన్యంతో ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు రూ.3 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటడంతో పాటు మెరిట్ స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులకు మొక్కలను అందించారు. పాఠశాల ఆవరణంలో పలురకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎం. త్రిమూర్తులు, బోడెంపూడి జయశంకర్, మాపర్తి సాంబశివరావు, చప్పిడి వీరయ్య మలాది శ్రీనివాసరావు, పీడీ ముద్దన విష్ణుప్రసాద్, హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు, రిటైర్డ హెచ్‌ఎం కమలాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఊరచెరువులో ఆక్రమణల తొలగింపునకు చర్యలు



ఊరచెరువులో ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

అద్దంకి, జూలై 12: ఊర చెరువులో ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టనున్నట్లు చీరాల ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ నగర్ సమీపంలో పలువురు వైసీపీ నాయకులు ఊర చెరువును ఆక్రమించి ఇళ్ల స్థలాలుగా మార్చి అమ్మకాలు చేస్తున్నారు. ఆక్రమణలపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. అలాగే, పలువురు టీడీపీ నేతలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో శుక్రవారం ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి ఊరచెరువును పరిశీలించారు. ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టడంతో పాటు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అద్దంకి కొండ వద్ద ఇండోర్ స్టేడియంకు వెనుకవైపు కొండపైన అద్దంకి పట్టణంలోని 130 మంది కార్పెంటర్‌లకు షాపుల ఏర్పాటుకు స్థలాల కేటాయింపునకు పరిశీలన చేశారు. నామ్ రోడ్డు వెంబడి అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో త హసీల్దార్ మహబూబ్ సుభాని, సర్వేయర్ శ్రీలక్ష్మి, వీఆర్వో బాషా, టీడీపీ నేతలు కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, యూనియన్ నాయకులు చెన్నకేశవులు, నాగేశ్వరరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



బియ్యం, కందిపప్పు అమ్మకాలను ప్రారంభిస్తున్న అధికారులు, టీడీపీ నేతలు

అద్దంకి, జూలై 12: బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర ధరల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తహసీల్దార్ సుభాని అన్నారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్, డాల్ మిల్లర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని కాకానిపాలెంలో బియ్యం, కందిపప్పు అమ్మకాలను శుక్రవారం తహసీల్దార్ సుభాని, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ప్రారంభించారు. స్టీమ్ బియ్యం కిలో రూ.49, పచ్చి బియ్యం రూ.48, కందిపప్పు రూ.160 చొప్పున విక్రయిస్తున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వాసుదేవరావు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, కాకాని అశోక్, సందిరెడ్డి శ్రీనివాసరావు, గోపి, భోజనపల్లి సత్యనారాయణ, గుంటూరు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో.. చీరాల, జూలై 12: తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని శుక్రవారం ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. పేరాల చిన్నరథం సెంటర్లో ఏర్పాటుచేసిన విక్రయ కేంద్రంలో బియ్యం కేజీ రూ.49లకు, ముడి బియ్యం కిలో రూ.48, దేశవాలీ కందిపప్పు రూ.160లకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఈఅవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ సూచించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

- ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి
- సాదాసీదాగా ముగిసిన మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

బల్లికురవ, జూలై 12: సీజనల్ వ్యాధుల ప్రబలకుండా తక్షణమే అన్ని గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం జరిగిన బల్లికురవ మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిధులు లేకపోవటంతో సమావేశం సాదాసీదాగా ముగిసింది. అధికారులు శాఖలవారీగా ప్రగతి నివేదికలు చదివి సమావేశాన్ని ముగించారు. ఈసందర్భంగా ఎంపీడీవో హనుమారెడ్డి మాట్లాడుతూ అన్ని గ్రామాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామస్థాయిలోని అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. వ్యవసాయధికారిణి కుమారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు 30 శాతం సబ్సిడీపై కందులు, పెసలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. గృహనిర్మాణ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సాంకేతిక అనుమతులు ఉన్న లబ్ధిదారులు డిసెంబరులోపు పనులు మొదలు పెట్టాలని, లేకుంటే గృహాలు రద్దవుతాయని చెప్పారు. వెలుగు ఏపీఎం సురేంద్రబాబు మాట్లాడుతూ పొదుపు సంఘాలలోని గ్రుపులకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. పశువైద్యాధికారి మహేశ్వరరావు మాట్లాడుతూ గొర్రెలు, తెల్లజాతి రకాల జంతువులకు వ్యాధులు రాకుండా వ్యాక్సిన్లు వేస్తున్నామన్నారు. వైద్యఆరోగ్యశాఖ వైద్యాధికారి రవితేజ మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పుల మేరకు సీజనల్ వ్యాధులు రాకుండా తమ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఎంఈవో వస్త్రం నాయక్ మాట్లాడుతూ బల్లికురవలో బాలికలకు వసతి గృహాన్ని మంజూరుచేయాలని కలెక్టర్‌కు నివేదిక పంపాలని కోరారు.

సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు చింతల అంజలి, ఈవోపీఆర్డీ సుమతి, సీడీపీవో సుధ, పలుశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఆర్టీసీ, ఇరిగేషన్, ఎన్ఎస్పీ అధికారులు గైర్హాజరయ్యారు.

రైతు కుటుంబానికి పరిహారం అందేలా చర్యలు



కౌలురైతు మృతదేహానికి నివాళులర్పిస్తున్న అధికారులు

నూతలపాడు(పర్చూరు), జూలై 12: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు భౌతికకాయాన్ని అధికారులు సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. మండలంలోని నూతలపాడుకు చెందిన బాదుడుల నాగరాజు(37) అప్పుల బాధతో చిలకలూరిపేట మండలం బొప్పూడి సమీపంలోని పొలాల్లో గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోస్టుమార్టం అనంతరం శుక్రవారం మృతదేహాన్ని స్వగ్రామం నూతలపాడు తరలించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో వ్యవసాయ అధికారులతోపాటు, రెవెన్యూ అధికారులు మృతుని నివాసానికి వెళ్ళి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా పరిహారం అందించే విదంగా చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు. నివాళులర్పించిన వారిలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.రామమోహన్‌రావు, తహసీల్దార్‌లు సీహెచ్ సుబ్బయ్య, వై.నాగరాజు, ఏవో రామ్మోహన్‌రెడ్డి, ఆర్ఐ ప్రేమ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

టీడీపీ ఫ్లెక్సీలను చించివేసిన గుర్తుతెలియని వ్యక్తులు

మేదరమెట్ల, జూలై 12: మండలంలోని బొడ్డువానిపాలెంలో తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు టీడీపీ ఫ్లెక్సీలు చించి కుప్పగా వేశారని ఆ గ్రామ టీడీపీ నాయకులు మేదరమెట్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొద్దిరోజుల క్రితం వైసీఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీలను కూడా గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ ఫ్లెక్సీలను చించడం గ్రామంలో ఉద్రిక్తతలకు దారి తీసింది. ఫ్లెక్సీల చించివేతపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆటపాటలతో చిన్నారులకు విద్యా బోధన

బల్లికురవ, జూలై 12: అయిదేళ్ల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలలో ఆటపాటలతో మెరుగైన విద్యను అందిస్తున్నట్టు సంతమాగులూరు ఐసీడీఎస్ సీడీపీవో సుధ తెలిపారు. శుక్రవారం బల్లికురవ మండల కేంద్రంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ పోషణ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషకాహారాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. ఈఅవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రాలలో సమయపాలన పాటించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని చెప్పారు.

మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే కొండయ్య దంపతులు



సింహాచల పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య దంపతులు

చీరాల, జూలై 12: సింహాచల పుణక్షేత్రంలో వరాహ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం ఎమ్మెల్యే కొండయ్య, సతీమణి బాలకొండమ్మ, పెదకుమారుడు గౌరీఅమర్‌నాధ్‌లతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించకున్నారు. ఈసందర్భంగా ఆలయ ఈవో ఎమ్మెల్యే కొండయ్య, ఆయన కుటుంబసభ్యులను ఆలయ సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేపు బీచ్ కబడ్డీ బాలబాలికల జట్ల ఎంపిక

చినగంజాం, జూలై 12: చినగంజాం మండల కార్యాలయాల సముదాయం ఎదురుగా గల సోపిరాల రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం మధ్యాహ్నం ఉమ్మడి ప్రకాశం జిల్లా బీచ్ కబడ్డీ(చెడుగుడు) జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెరుకూరి పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్ల శిక్షణ అనంతరం ఆగస్టు 2 నుంచి 4వ తేదీ వరకు నెల్లూరు జిల్లా ఇందుకూరుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట(చీరాల), జూలై 12: వీఆర్‌ఎస్ అండ్ వైఆర్‌ఎన్ కళాశాల ప్రాంగణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మెయింటెనెన్స్‌లో భాగంగా సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని సంపత్‌నగర్, కొత్తపేట, ఐఎల్‌టీడీ కాలనీ, వడ్డె సంఘం, పాపాయిపాలెం, వాకావారి పాలెం, రోశయ్యకాలనీ, రామాపురం, వాడరేవు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చినగంజాంలో.. చినగంజాం, జూలై 12: మండలంలోని చినగంజాం, కొత్తపాలెం, పెదగం జాం సబ్‌స్టేషన్ల పరిధిలో వార్షిక మరమ్మతులలో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈఈ పడవల గణనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మార్టూరులో.. మార్టూరు, జూలై 12: విద్యుత్ సబ్‌స్టేషన్‌ల్లో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మార్టూరు, రాజుపాలెం, కొత్తగా ఏర్పాటుచేసిన విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఇంకొల్లులో.. ఇంకొల్లు, జూలై 12: మండలంలోని ఇంకొల్లు, ఇడుపులపాడు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ జాగర్లమూడి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అద్దంకిలో.. అద్దంకి, జూలై 12: అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ సబ్‌స్టేషన్‌లో కొత్తగా బ్రేకర్ లు ఏర్పాటు చేస్తున్నందున శనివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఏఈ శివప్రసాద్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మైనర్‌లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరం

చీరాలటౌన్, జూలై 12: మైనర్‌లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని న్యాయాధికారి సుధ పేర్కొన్నారు. కోర్టు భవన సముదాయంలో శుక్రవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నియంత్రణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్‌కే రెహానా, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, ఎస్‌డి మథీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆరు కిలోల గంజాయి పట్టివేత

చీరాలటౌన్, జూలై 12: గం జాయి, ఇతర మత్తు పదార్థాల తో యువత భవితవ్యం ఛిన్నా భిన్నమవు తుంద ని టూటౌన్ సీఐ సోమశేఖర్ అ న్నారు. స్టేషన్ పరిధిలో ఆరు కి లోల గంజాయిని సీజ్ చేశారు. ఇందుకుసంబంధించిన వివరాలను శుక్రవారం స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మే రకు స్టేషన్ పరిధిలోని కారంచేడు - ఈపూరుపాలెం రోడ్డులో సీఐ సిబ్బందితో కలిసి ముమ్మర తనిఖీలు చేశారు. ఈక్రమంలో ఉజిలీపేటకు చెందిన మా డపాటి వీరాంజనేయులు, రాజు జయలక్ష్మి, వల్లభ శామ్యేల్, నల్లగొర్ల రాజేష్, జయంతిపేటకు చెందిన కావూరి నానిలను అదుపులోకి తీసుకుని ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే, గత మంగళవారం వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో ఉజిలీపేట సచివాలయం సమీపంలో ఓ మహిళ విక్రయాలు జరుపుతుండగా దాడి చేసి పట్టుకున్నారు.

ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి నియంత్రణకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, నాగూర్ వలి, ఆంజనేయులు, స్వరూప పాల్గొన్నారు.

మార్టూరు రోటరీ కార్యవర్గం ప్రమాణస్వీకారం

మార్టూరు, జూలై 12: మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా మద్దుమాల కోటేశ్వర రావు, కార్యదర్శిగా మాదాల సాంబశివరావు, కోశాధికారిగా గరిమిడి శ్రీనివాసరావు ఎంపికయ్యారు. గురువారం రాత్రి స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమా నికి ఎఫర్ట్ సంస్థ అధ్యక్షుడు జాష్టి వెంకటమోహనరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గవర్నర్ శరత్‌చౌదరి నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు తాళ్లూరి సాంబశివరావు, కొర్రపాటి కాజారావు, ఇంటూరి ఆంజనేయులు, చెన్నుపాటి బసవరాములు, షేక్ కాజాహుస్సేన్, చెరుకూరి అంజిబాబు, ఈశ్వరప్రసాద్, రావి అంకమ్మచౌదరి, జాష్టి అనూరాధ పాల్గొన్నారు.